ప్రజాశక్తి





మంగళవారం 21 జనవరి 2025 | 8 పేజీలు

ఎన్‌టిఆర్ | కృష్ణా

కొత్త పెన్షన్ల కోసం నిరసన

● కలెక్టరేట్ వద్ద వృద్ధులు, వికలాంగులు, వితంతువుల ధర్నా

ప్రజాశక్తి - విజయవాడ : కొత్త పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం నగరంలోని ఎన్‌టిఆర్ జిల్లా కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన నిర్వహించారు. వృద్ధులు, వికలాంగులు, వితంతువులు ప్లకార్డులు, దరఖాస్తులను చేతబట్టి ఆందోళన చేపట్టారు. వీరి ఆందోళనలకు విఎంసి కౌన్సిల్‌లో సిపిఎం ఫ్లోర్ లీడర్, పార్టీ పశ్చిమ నగర కార్యదర్శి బోయి సత్యబాబు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సత్యబాబు మాట్లాడుతూ బతికుండగా కొత్త పెన్షన్లు మంజూరు చేయరా అని ప్రశ్నించారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలవుతున్నా కొత్త పెన్షన్లు మంజూరు చేయలేదని విమర్శించారు. 50 ఏళ్లకే పెన్షన్ ఇస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం అన్యాయంగా రద్దు చేసిన పెన్షన్లను పునరుద్ధరించాలని కోరారు. వేలాది మంది వృద్ధులు, వితంతువులు, వికలాంగులు ప్రభుత్వ పెన్షన్లకు నోచుకోవడంలేదన్నారు. నెల కొత్త పెన్షన్లు మంజూరు చేయకుండా కాలయాపన చేయడం సరికాదన్నారు.





కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న వృద్ధులు, వికలాంగులు, వితంతువులు; సత్యబాబు, దుర్గారావులను అడ్డుకుంటున్న పోలీసులు (పక్క ఫొటో)

అడ్డుకున్న పోలీసులు

తమ సమస్యల పరిష్కరించాలని కోరుతూ దరఖాస్తులు ఇచ్చేందుకు వచ్చిన వారిని పోలీసులు అడ్డుకున్నారు. లోనికి వెళ్లనీయకుండా నిలిపివేశారు. ఈ సమయంలో పోలీసులకూ, ఆందోళనకారులకు మధ్య వాగ్వాదం జరిగింది. సత్యబాబు సమస్యను వివరించి కలెక్టరేట్లోకి అనుమతించాలని డిమాండ్ చేశారు. కొద్దిసేపు అనంతరం పోలీసులు వారిని అనుమతించారు. ఈ ఆందోళనా కార్యక్రమంలో ఐద్వా నగర కార్యదర్శి జి ఆదిలక్ష్మి, పెన్షన్ సాధన సంక్షేమ సంఘం నగర కన్వీనర్ సిహెచ్.దుర్గారావు. కమిటీ నాయకులు వీ.కోటేశ్వరమ్మ. శ్యామల, మల్లేశ్వరి వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశకు వినతిపత్రం సమర్పించారు.



టిడిపి రాష్ట్ర కార్యాలయంలో విచారణకు హాజరైన కొలికపూడి

టిడిపి క్రమశిక్షణా కమిటీ ముందు కొలికపూడి హాజరు

ప్రజాశక్తి - విజయవాడ : తిరువూరు ఎంఎల్ఎ కొలకపూడి శ్రీనివాసరావు సోమవారం టిడిపి క్రమ శిక్షణా కమిటీ ముందు హాజరయ్యారు. టిడిపి రాష్ట్ర కార్యాలయంలో జరిగిన విచారణకు ఆయన హాజరయ్యారు. గోపాలపురం ఘటనపై కమిటీకి వివరించారు. టిడిపి కార్యకర్త మృతి చెందితే పరామర్శకు వెళ్లానని, వైసిపికి చెందిన కుటుంబం రోడ్డుపై ముళ్ల కంచె వేశారని, స్థానికులకు ఇబ్బందిగా మారడంతో కంచెను తొలగించానని విచారణ కమిటీకి వివరించినట్లు తెలిసింది. కంచెను తొలగించడంతో తనను లక్ష్యంగా చేసుకున్నారని వివరించినట్లు సమాచారం. ఆత్మహత్యాయత్నం చేసి వైసిపి నేతలు రాద్ధాంతం చేస్తున్నారని చెప్పినట్లు తెలిసింది. సంబంధిత వైసిపి కుటుంబం వారు 2013లో చంద్రబాబుపై నీళ్ల బాటిల్ వేశారని తెలిపినట్లు సమాచారం. వాస్తవాలెంటో గ్రామస్తులను అడిగితే తెలుస్తుందని వివరించినట్లు తెలిసింది.



విచారణ అనంతరం మీడియాతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ కొలికపూడి

చిరు నిర్లక్ష్యానికి బలికావొద్దు

● అవగాహనా ర్యాలీ ప్రారంభోత్సవంలో డిటిసి మోహన్

ప్రజాశక్తి - విజయవాడ : హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనం నడపటం క్షమించరాని నేరమని, చిన్న నిర్లక్ష్యానికి నిండు ప్రాణాన్ని బలిచేసుకోవద్దని ఉప రవాణా కమిషనర్ ఎ.మోహన్ అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన బైక్ ర్యాలీని డిటిసి సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా డిటిసి మోహన్ మాట్లాడుతూ రహదారి భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించి ప్రమాదాలను నివారించేందుకు రహదారి భద్రతా మాసోత్సవాల నిర్వహిస్తున్నామన్నారు. హెల్మెట్ వాడకంపై అవగాహన కలిగి ఉండడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ర్యాలీలో ఆర్టీఓ కె. వెంకటేశ్వరరావు, మోటార్ వాహన తనిఖీ అధికారులు కె. శివరాం గౌడ్, ఉదయ్ శివప్రసాద్, రవాణా ఉద్యోగుల సంఘం జోనల్ అధ్యక్షుడు ఎం.రాజుబాబు కార్యాలయ సిబ్బంది, వాహన డీలర్లు తదితరులు పాల్గొన్నారు.



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డిటిసి ఎ.మోహన్

గణతంత్ర వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు

కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ, సిపి రాజేశేఖర్‌బాబు

ప్రజాశక్తి - విజయవాడ : జాతీయ సమైక్యత చాటి చెప్పేలా గణతంత్ర వేడుకలను నిర్వహించేందుకు అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ సిపి బి. రాజేశేఖర్‌బాబు ఆదేశించారు. ఐజిఎంసి స్టేడియంలో నిర్వహించనున్న 76వ గణతంత్ర వేడుకల ఏర్పాట్లను సోమవారం కలెక్టర్ డా. జి. లక్ష్మీశ సిపి పి.రాజేశేఖర్‌బాబులు పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ సమైక్యత ఉట్టిపడే విధంగా వేడకలకు ఏర్పాట్లు పూర్తి చేసి పరేడ్‌కు సిద్దంగా ఉంచాలన్నారు. నగర పోలీస్ కమీషనర్ పి. రాజశేఖర్ బాబు మట్లాడుతూ వేడుకలలో పాల్గొనేందుకు విచ్చేసే విఐపి వాహనాలకు ప్రత్యేక ప్రాక్సిమేట్ పార్కింగ్ ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. ఏర్పాట్ల పరిశీలనలో డిసిపి గౌతమిషాలీ, విజయవాడ ఆర్‌డివో చైతన్య, ముఖ్యమంత్రి భద్రత అధికారులు, రాజ్‌భవన్ అధికారులు పోలీస్, ఆర్అండ్‌బి, ఐఅండ్‌పిఆర్, రెవెన్యూ, ఆర్‌డబ్ల్యు ఎస్ విద్యా, వైద్య తదితర శాఖల అధికారులు ఉన్నారు.



స్టేడియంలో ఏర్పాట్లు పరిశీలించి మాట్లాడుతున్న కలెక్టర్

రేపు "రాష్ట్ర సమగ్రాభివృద్ధి - ప్రత్యామ్నాయ విధానాలు"పై సదస్సు

ప్రజాశక్తి - విజయవాడ : సిపిఎం రాష్ట్ర 27వ మహాసభ సందర్భంగా ఈనెల 22వ తేదీ ఉదయం 10 గంటలకు "రాష్ట్ర సమగ్రాభివృద్ధి - ప్రత్యామ్నాయ విధానాలు" అన్న అంశంపై సదస్సు జరుగుతుంది. విజయవాడ రాఘవయ్యపార్క్ సమీపంలోని బాలోత్సవ భవన్ రెండో అంతస్తులో జరిగే ఈ సదస్సులో ఉపన్యాసకులుగా మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, ఎంఎల్‌సి కె.ఎస్.లక్ష్మణరావు, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్ వి.అంజిరెడ్డి పాల్గొంటారు.

నేడు లెనిన్ శత వర్ధంతి ముగింపు సభ

ప్రజాశక్తి - విజయవాడ : ప్రపంచ ప్రప్రధమ సోషలిస్టు రాజ్య నిర్మాత, విప్లవ యోధుడు కామ్రేడ్ వి.ఐ.లెనిన్ శత వర్ధంతి ముగింపు (101వ వర్ధంతి) సందర్భంగా మంగళవారం ఉదయం 9.30 గంటలకు విజయవాడ లెనిన్ సెంటర్‌లోని లెనిన్ విగ్రహం వద్ద వామపక్షాల నేతలు నివాళులర్పిస్తారు. అనంతరం లెనిన్ సెంటరులోనే సాయంత్రం 5 గంటలకు "ఆట - పాట - మాట', సందేశాల కార్యక్రమం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో వామపక్షాల నేతలతోపాటు ప్రముఖ కవి, గాయకుడు గోరేటి వెంకన్న పాల్గొంటారు.



పెన్షన్ పంపిణీ విధుల నుండి అంగన్వాడీలను మినహాయించాలి

కలెక్టర్‌కు యూనియన్ నేతల వినతి

ప్రజాశక్తి - విజయవాడ : అంగన్‌వాడీలను పెన్షన్ పంపిణీ విధుల నుండి పూర్తిగా మినహాయించాలని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్ సుప్రజ కోరారు. ఈ మేరకు ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్ డాక్టర్ జి లక్ష్మీశకు యూనియన్ నేతలతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుప్రజ మాట్లాడుతూ తెల్లవారుజామునే ఎక్కువ మొత్తంలో డబ్బులు తీసుకొని వెళ్లి పంచటం, ట్రావెలింగ్, డబ్బులు పంపిణీ తదితర విషయాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఇప్పటికే ప్రీ స్కూల్, గర్భిణీ, బాలింతలకు ఫుడ్ పంపిణీతో కూడిన అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ, వివిధ రకాల సర్వేలు, రిపోర్టులు వంటి వాటి వలన పని భారం విపరీతంగా పెరిగిపోయిందన్నారు. సెంటర్ నిర్వహణ కన్నా అదనపు పనులే ఎక్కువుగా చేయాల్సి వస్తోందన్నారు. దీంతో అంగన్‌వాడీలు శారీరకంగా, మానసికంగా ఆందోళన చెందుతున్నారని అన్నారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ...యూనియన్ నేతల ఇచ్చిన సమాచారాన్ని ప్రభుత్వం దృష్టి తీసుకెళతానని చెప్పారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కోశాధికారి జైనీ రత్నకుమారి, జిల్లా కమిటీ సభ్యులు ఎల్ రాణి తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న వి.ఉమామహేశ్వరరావు

కార్పొరేట్లకు అందలం... కార్మికులు, రైతాంగంపై దాడి...

బిజెపి విధానాలపై వి.ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి - విజయవాడ : కేంద్రలోని బిజెపి మోడీ ప్రభుత్వం కార్పోరేట్లకు తొత్తులా వ్యవహరిస్తూ కార్మికవర్గం, రైతాంగంపై దాడిని తీవ్రం చేసిందని, దీనిని ప్రజలంతా ఐక్యంగా తిప్పికొట్టాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. విజయవాడ నవరంగ్ థియేటర్ వద్ద గల శ్రీశ్రీ భవన్‌లో సిఐటియు, రైతు, వ్యవసాయ కార్మికసంఘాల ఆధ్వర్యంలో కార్మిక కర్షక ఐక్యతా దినోత్సవ సభ జరిగింది. ఈసభలో ఉమామహేశ్వరరావు ప్రసంగిస్తూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ తిరోగమన, కార్పోరేట్ అనుకూల విధానాల వలన దేశం పరిస్థితి అన్ని రంగాల్లో దిగజారిందని, అంబానీ, అదానీ వంటి కార్పోరేట్లకు దేశసంపదను కట్టబెట్టి కార్మికులు, రైతాంగం, పేదల బ్రతుకులను నాశనం చేస్తోందని దుయ్యబట్టారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు ఎన్.సిహెచ్.సుప్రజ అధ్యక్షతన జరిగిన ఈ సభలో కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎ.మాల్యాద్రి, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి కె.కళ్యాణ్‌కుమార్ తదితరులు ప్రసంగించారు

21 నుండి జన శిక్షణా సంస్థాన్లో ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : విజయవాడ, పరిసర ప్రాంతాల్లోని మహిళలకు నైపుణ్య ఉపాధి అవకాశాలను కల్పించేందుకుగాను నైపుణ్యాభివద్ధి, వ్యవస్థాపక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జన శిక్షణ సంస్థాన్ వారు అతి తక్కువ ఫీజులతో వివిధ కోర్సుల్లో ఈనెల 21వ తేదీ నుండి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ ఎ.పూర్ణిమ తెలిపారు. జ్యూట్ బ్యాగ్‌ల తయారీ (3 నెలలు), మగ్గం వర్క్ (3 నెలలు) శిక్షణా తరగతులను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు జన శిక్షణ సంస్థాన్ కార్యలయంలో స్వయంగాగానీ, ఫోన్ నెం:0866 - 2470420లోగానీ సంప్రదించాలని సూచించారు.

జిల్లాస్థాయి పిజిఆర్ఎస్‌కు 144 అర్జీలు

ప్రజాశక్తి - విజయవాడ : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం ద్వారా అందిన అర్జీలను నిర్దేశ గడువులోగా పరిష్కరించే విధంగా అధికారులు ప్రత్యేక దష్టిపెట్టాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ.... డీఆర్‌వో ఎం.లక్ష్మీ నరసింహం, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి పి.జ్యోతి తదితరులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 144 అర్జీలు వచ్చాయి.

విఎంసిలో 12 ఫిర్యాదుల స్వీకరణ

ప్రజాశక్తి - విజయవాడ : ప్రజల సమస్యలను నిత్యం పరిష్కరించే దిశగా జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో గల కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం ఉదయం ఇంచార్జి కమిషనర్ డాక్టర్ డి చంద్రశేఖర్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికారులు 12 ఫిర్యాదులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ ఆర్ శ్రీనాథ్, చీఫ్ సిటీ ప్లానర్ జి వి జి ఎస్ వి ప్రసాద్, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి సజన, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబు శ్రీనివాస్, సుపరింటెంగ్ ఇంజనీర్లు పి.సత్యనారాయణ, పి సత్య కుమారి, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్, డీఎఫ్ఓ మాల్యాద్రి, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి.ఎస్.ఎస్ సోమశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

సిపి ఆఫీసులో 92 ఫిర్యాదుల స్వీకరణ

ప్రజాశక్తి - విజయవాడ : నగరంలోని పోలీస్ కమిషనర్ వారి కార్యాలయంలో సోమవారం జరిగిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమంలో 92 ఫిర్యాదులను స్వీకరించారు. డిసిపి ఏ.బి.టి.ఎస్.ఉదయారాణి బాధితులు నుండి వివిధ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను స్వీకరించారు.

ఆయిల్ పామ్ సాగుతో రైతులకు లాభాలు

కృష్ణాజిల్లా కలెక్టర్ డికె బాలాజీ

ప్రజాశక్తి-చల్లపల్లి (మొవ్వ)

ప్రకృతి వైపరీత్యాలను సైతం తట్టుకుని రైతులకు లాభాలను ఇచ్చే పంట ఆయిల్ పామ్ సాగు అని, ఆ సాగు వైపు రైతులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు.సోమవారం ఆయన స్థానిక శాసనసభ్యుడు వర్ల కుమార్ రాజాతో కలిసి మొవ్వ మండలంలో పర్యటించి ఆయిల్ పామ్ మొక్కల నర్సరీ, పంట సాగును క్షేత్రస్థాయిలో సందర్శించారు. మొవ్వ మండలములోని కొండవరం గ్రామంలో కొసరాజు వెంకటలక్ష్మి దాసు అనే రైతు 13 ఎకరాలలో సాగుచేసిన ఆయిల్ పామ్ సాగు పంటను, అదేవిధంగా సాగులో అంతరపంటగా వేసిన మినుము పంటను ఆసక్తిగా పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగు చేపట్టే రైతులకు హెక్టారుకు 143 మొక్కలను వంద శాతం సబ్సిడీతో ఉచితంగా అందిస్తామన్నారు. సాధారణంగా ఒక్కొక్క

ఆయిల్ పామ్ మొక్కలను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎంఎల్ఏ



మొక్క ధర రూ.193 ఉంటుందని, రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పూర్తిస్థాయి సబ్సిడీతో ఉచితంగా మొక్కలను అందిస్తుందన్నారు. అదేవిధంగా బిందు సేద్యం పద్ధతిపై సాగు చేపట్టే రైతులకు 50 శాతం రాయితీతో డ్రిప్పర్స్, జెట్ పరికరాలను అందిస్తామని అన్నారు. పంట ఆయిదవ సంవత్సరం నుంచి చేతికి వస్తుందని, ఆ లోపుగా మొదటి నాలుగు సంవత్సరాల వరకు మొక్కలకు ఎరువుల యాజమాన్యం, అంతర పంటల సాగు నిమిత్తం సంవత్సరానికి ఒక హెక్టారుకు రూ.5,625లను రైతులకు అందించడం జరుగుతుందన్నారు. ఒకసారి నాటిన మొక్కలతో 30 సంవత్సరాల వరకు నిరంతర ఆదాయాన్ని పొందవచ్చన్నారు..శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా మాట్లాడుతూ పమిడిముక్కల గ్రామంలో 3ఎఫ్ కంపెనీ వారు ఆయిల్ పామ్ కు సంబంధించి నర్సరీ ఏర్పాటు చేసిందని, త్వరలో వారు పరిశ్రమ ఏర్పాటుకు సిద్ధమైనట్లు తెలిపారు. నియోజకవర్గంలో ఇప్పటికే 200 ఎకరాల్లో పంట సాగు అవుతోందని, రానున్న రోజుల్లో ఎక్కువ విస్తీర్ణంలో పంట సాగయ్యే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో 3ఎఫ్ ఆయిల్ పామ్ ప్రైవేట్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ పాచర్ల విజయ ప్రసాద్, ఉద్యాన శాఖ అధికారిణి జె జ్యోతి, ఏపీ మైక్రో ఇరిగేషన్ పీడీ విజయలక్ష్మి, పమిడిముక్కల గ్రామ సర్పంచ్ ముళ్ళపూడి సునీత, ఉద్యానవన అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మల్లవల్లిలో పరిశ్రమల స్థాపనకు చర్యలు : యార్లగడ్డ

ప్రజాశక్తి-ఉంగుటూరు: మండలంలోని ఆత్కూరు స్వర్ణ భారత్ ట్రస్ట్‌లో నైపుణ్య శిక్షణ పొందుతున్న యువతీ యువకులతో సోమవారం ఏర్పాటు చేసిన ముఖాముఖి సమావేశంలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ మల్లవల్లి పారిశ్రామికవాడకు 420 పరిశ్రమలు వస్తున్నట్లు తెలిపారు. మల్లవల్లి ఇండస్ట్రియల్ కారిడార్‌లో పరిశ్రమల స్థాపన కోసం 183 కంపెనీలు స్థలాలు కేటాయించాలని అధికారులకు దరఖాస్తు చేసినట్లు వెల్లడించారు. రానున్న రోజుల్లో ఒక్క గన్నవరం నియోజకవర్గం నుంచే యువతకు 50 వేల ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందన్నారు. నియోజకవర్గంలో 15 వేల మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తానని లేని పక్షంలో రాజకీయాలలో కొనసాగనని చెప్పానని అందుకు తగ్గట్టుగానే ఉద్యోగాల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 28న అమర్ రాజా కంపెనీ వారితో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. తమిళనాడు రాష్ట్రంలోని హోసూరు పారిశ్రామికవాడ తరహాలో మల్లవల్లి పారిశ్రామికవాడ కూడా అభివృద్ధి చెందుతుందని ధీమా వ్యక్తం చేశారు.



రెడ్‌క్రాస్ చేయూత

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు

వడ్లమన్నాడు హరిజనవాడలో షార్ట్ సర్క్యూట్ వలన అగ్ని ప్రమాదం జరిగి సర్వం కోల్పోయిన బాధితులకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కృష్ణా జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిత్యవసర సరుకులు సోమవారం అందజేశారు. మండల తాసిల్దార్ లోకరాజు సమక్షంలో వంట పాత్రలు తాత్కాలిక నివాసం కోసం టార్పాలిన్, సబ్బులు, పేస్టులు, కొబ్బరి నూనెతో కడిగిన కూడిన హైజిన్ కిట్, దుప్పట్లు రెడ్ క్రాస్ జిల్లా సెక్రటరీ భవిరి శంకర్ నాధ్ ట్రెజరర్ కొండపల్లి రామ్ బాలాజీ అందజేశారు.ఈ కార్యక్రమంలో వీఆర్వో జయసూర్య, రెడ్ క్రాస్ సభ్యుడు రవోనాక్ ఖాన్ పాల్గొన్నారు.

పాడి రైతుల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-మోపిదేవి: పల్లెల్లో వ్యవసాయంతో పాటు పశు సంపద అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇచ్చి రైతుల ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తుందని జిల్లా పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ నాగభూషణ్ బాబు పేర్కొన్నారు సోమవారం మోపిదేవి మండల పరిధిలోని కొక్కిలిగడ్డ కొత్తపాలెంలో జరిగిన పశువైద్య శిబిరానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు ఈ సందర్భంగా నిర్వహించిన దూడల అందాల పోటీలలో రైతులు ఉత్సాహంగా పాల్గొన్నారు మొదటి మూడు స్థానాల్లో నిలిచిన దూడల యజమానులకు అధికారులు ప్రజాప్రతినిధులు బహుమతులు అందజేశారు పోటీలలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి కూడా ప్రోత్సాహక బహుమతులు అందజేశారు ఈ సందర్భంగా డిడి మాట్లాడుతూ పశు వైద్య శిబిరాలలో సామాన్య వ్యాధులు చూడి కట్టని పశువులకు అవసరమైన చికిత్సలు గర్భ కోస వ్యాధుల నివారణకు చికిత్స నట్టల నివారణ మందు అవసరమైన దూడలకు పశువులకు గొర్రెలు మేకలకు ఉచితంగా అందిస్తామన్నారు గొర్రెలు మేకలలో బొబ్బ వ్యాధి నివారణ కు టీకాలు వేయడం జరుగుతుంది అన్నారు కోళ్లకు వస్తున్న కొక్కెర తెగులు మసూచి వ్యాధులకు టీకాలు వేయడం జరుగుతుందన్నారు



పశు యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు ఆసక్తి ఉన్న రైతులు పశుగ్రాసం పెంచుకోవడం కోసం జాతీయ ఉపాధి హామీ పథకం కింద వంద శాతం రాయితీతో పది సెంట్లు నుంచి కార్యక్రమం విస్తీర్ణంలోపు అనేక పర్యాయాలు కోతకు వచ్చే పశుగ్రాసం విత్తనాలను ఉచితంగా అందజేస్తామన్నారు ఈ కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ హరిత మోపిదేవి మోపిదేవి వెటర్నరీ వైద్యులు డాక్టర్ నందకిషోర్ పెదప్రోలు వెటర్నరీ అధికారి నడకుడిటి దడ తదితరులు పాల్గొన్నారు గ్రామ సర్పంచ్ కొక్కిలిగడ్డ మాధవి కోఆప్షన్ నెంబర్ చందన రంగారావు తదితరులు విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు.

అగ్నిప్రమాద బాధితులకు పరామర్శ


ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: విపత్కర పరిస్థితుల్లో నష్టపోయిన ఆపన్నులకు ప్రభుత్వ పరంగానే కాకుండా, వ్యక్తిగతంగా అన్ని విధాలుగా అండగా ఉంటామని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. మండలంలోని వడ్లమన్నాడు గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన నాలుగు బాధిత



కుటుంబాలను గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సోమవారం పరామర్శించారు. బాధితులకు ప్రభుత్వం నుండి అందాల్సిన పరిహారం సత్వరం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు మల్లిపెద్ది సుబ్రహ్మణ్యం, కొడాలి రామరాజు, వాసే మురళి, సర్పంచ్ కటికల జ్యోతిలత, ఉప సర్పంచ్ గరికపాటి రాంబాబు, కూటమి నేతలు గరికపాటి వెంకటేశ్వరరావు, పెన్నేరు రమేష్ బాబు, మాదా శ్రీనివాసరావు, తోట చిన్నారి, పామర్తి సూరిబాబు, గుడిసెల రమేష్, కడప బాబి, కటకం కొండ పాల్గొన్నారు.

కార్మికుల విషయంలో రాజకీయ జోక్యం తగదు

ప్రజాశక్తి-ఉయ్యూరు: గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికుల పట్ల రాజకీయ నాయకుల జోక్యం, వేధింపులు లేకుండా చేయాలని సిఐటియు నాయకులు బి.రాజేష్ అన్నారు. సోమవారం కలవపాముల గ్రామ పంచాయితీలో పనిచేస్తున్న కార్మిక సమస్యలు పరిష్కరించాలని గ్రామ సచివాలయం అధికారికి అర్జీ సమర్పించారు. ప్రధానంగా కార్మికుల పట్ల రాజకీయ నాయకుల వేధింపులు అరికట్టాలని, కనీస వేతనాలు అమలు చేయాలని, రెండు జతల యూనిఫామ్, శానిటైజర్, సామాగ్రి వంటి సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు జ్యోతి, కె.పరశురామయ్య, రజిని, రత్న మాణిక్యం పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలి

ప్రజాశక్తి-మోపిదేవి

మోపిదేవిలోని శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో ఖాళీగా ఉన్న కాంట్రాక్ట్ ఉద్యోగాలను స్థానిక నిరుద్యోగ యువతకు కేటాయించాలని యువ న్యాయ శాస్త్ర బడే గౌతమ్ డిమాండ్ చేశారు. కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగాలను భర్తీ చేస్తున్న క్రమంలో స్థానికంగా మోపిదేవి ప్రాంతంలో ఉన్న నిరుద్యోగులైన యువతకు సముచిత స్థానం కల్పించాలన్నారు. అందులో కనీసం సగం పోస్టులను అయినా వారికి కేటాయించి న్యాయం చేయాలని కోరారు.

చోరీ కేసులో దొంగకు జైలు

ప్రజాశక్తి-గన్నవరం: బైకు దొంగతనం కేసులో నేరం రుజువు కావడంతో దొంగకు ఐదు నెలలు జైలు శిక్ష విధిస్తూ గన్నవరం కోర్టు న్యాయమూర్తి సోమవారం తీర్పు చెప్పారు. గన్నవరం గ్యాస్ కంపెనీ ఏరియాలో అమరేష్ అనే వ్యక్తి బైక్ పోయింది. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుపై గన్నవరం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేయగా ముద్దాయిగా అప్పికట్ల రాజీవ్ ను గుర్తించి గన్నవరం 8వ అడిషనల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి రిమాండ్ విధించారు. తదుపరి కేసు విచారణ చేసిన న్యాయస్థానం దొంగపై నేరం రుజువు కావడంతో ఐదు నెలల కారాగార శిక్ష, రూ.500 జరిమానా విధించారు. జరిమానా చెల్లించని యెడల అదనంగా 1 నెల జైలు శిక్ష అనుభవించవలసిందిగా న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

ఆరోగ్య కేంద్రం తనిఖీ

ప్రజాశక్తి-గన్నవరం

గన్నవరం సామాజిక ఆరోగ్య కేంద్రం ను వంద పడకల ఆసుపత్రి గా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. సోమవారం ఆస్పత్రిని ఆయన తనిఖీ చేశారు. రోగులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఆస్పత్రి ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. మెయిన్ గేటుకు రెండువైపులా డ్రైనేజీలో చెత్త ఉండడాన్ని గమనించారు. దానిని శుభ్రం చేయించాలన్నారు. వైద్యులతోనూ మాట్లాడారు. స్పెషలిస్టులు కావాలని, ఆధునిక ఆపరేషన్ థియేటర్లు కట్టాలని, డాక్టర్లకు రూములు కావాలని ఆస్పత్రి ఇన్చార్జి వైద్యులు శారమ్మ ఆయన దృష్టికి తెచ్చారు. ఈ ఆస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా చేయాలని, ఇప్పటికే పలు మార్లు ప్రభుత్వ దృష్టికి తీసుకుని వెళ్లిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బోయపాటి మురళీకృష్ణ, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు సులోచన, ఎంపీటీసీ సభ్యులు పడమట రంగారావు తదితరులు పాల్గొన్నారు.



పశువులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-చల్లపల్లి (మొవ్వ): మొవ్వ మండల పరిధిలోని భట్ల పెనుమర్రు పశువైద్యశాలలో పశు ఆరోగ్యశిబిరములు సోమవారం నిర్వహించారు.ఈ శిబిరము లో పశువైద్యాధికారి జి వెంకటపయ్య పశువులకు చూడి పరీక్షలు చేసి ఎదకురాని పశువులకు, గర్భకోశ వ్యాధిగ్రస్తా పశువులకు చికిత్సను అందించారు.గొర్రెలు మేకలు లకు బొబ్బ టీకాను వేశారు. లేగ దోడలకు నట్టల నివారణ మందును తాగించారు.కోళ్లల్లో వైరస్ నిర్మూలనకు టీకాలు వేశారు రైతులకు మినీ గోకులం, బహువార్షిక పశుగ్రాసాల సాగు,సంచార పశు ఆరోగ్య సేవ వాహనం 1962 దాని యొక్క ఉపయోగాలపై అవగాహన కల్పించారు. పశు కిసాన్ క్రెడిట్ కార్డ్ ఉపయోగాలను రైతులకు వివరించారు. లింగ నిర్ధారిత వీర్యం గురించి అవగాహన కల్పించారు.



హనుమాన్ జంక్షన్ (గన్నవరం): బాపులపాడు మండలం బొమ్ములూరు గ్రామంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన పల్లె పశువుల మెడికల్ క్యాంప్ ను సోమవారం సర్పంచ్ కాటూరు విజయ్ భాస్కర్ ప్రారంభించారు. వైద్యులు పశువులను పరీక్షలు చేసి ఉచిత మందులు పంపిణీ చేశారు.

నర్సరీ సందర్శన

ప్రజాశక్తి-పమిడిముక్కల: ఆయిల్ పామ్ వ్యవసాయం వల్ల ఎన్నో లాభాలు ఉన్నాయని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. సోమవారం పమిడిముక్కల్లోని నర్సరీ కేంద్రాన్ని శాస్త్రవేత్తలతో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని రాష్ట్రాల్లో ఆయిల్ పామ్ ఎక్కువగా సాగవుతుందని, ఉపాధి కల్పించడానికి మొక్కలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా, ఫామ్ మేనేజర్ విజయప్రసాద్, తాసిల్దార్ నవీన్ కుమార్, సర్పంచ్ ముల్లపూడి సునీత, ఎపిఎం విజయలక్ష్మి పాల్గొన్నారు.

జాతీయ పోటీల్లో సత్తా చాటాలి

శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : ఉత్తరాఖండ్ రాష్ట్రంలో ఈనెల 28నుంచి ఫిబ్రవరి 14వ తేదీ వరకూ జరిగే 38వ జాతీయ క్రీడాపోటీల్లో ఏపీ క్రీడాకారులు సత్తాచాటాలని ఏపీ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ అనిమిని రవినాయుడు ఆకాంక్షించారు. విజయవాడ గుణదలలోని ఓల్గా ఆర్చరీ అకాడమీలో ఓల్గా ఆర్చరీ అసోసియేషన్ ప్రెసిడెంట్ చెరుకూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన కోచింగ్ క్యాంపును శాప్ ఛైర్మన్ సోమవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా 38వ జాతీయస్థాయి పోటీల్లో ఏపీ నుంచి ప్రాతినిధ్యం వహించనున్న ఆర్చరీ క్రీడాకారులను ఆయన పరిచయం చేసుకుని అభినందనలు తెలిపారు. అనంతరం కృష్ణానదిలో ఆంధ్రా కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ యలమంచి శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన బీచ్ కబడ్డీ కోచింగ్ క్యాంపును శాప్ ఛైర్మన్ ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని వారికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులతో మాట్లాడుతూ జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు శిక్షణ తీసుకుంటున్న క్రీడాకారులు అత్యుత్తమ ప్రదర్శనను కనబరిచి ఏపీని అగ్రస్థానంలో నిలబెట్టాలన్నారు. క్రీడాకారుల భవిష్యత్తే ధ్యేయంగా రాష్ట్రప్రభుత్వం నూతన స్పోర్ట్స్ పాలసీని తీసుకొచ్చిందని, ప్రభుత్వ ఉద్యోగాల కల్పనలో స్పోర్ట్స్ కోటాను 2శాతం నుంచి 3శాతానికి పెంచిందని, క్రీడాప్రోత్సాహకాలను భారీగా పెంచిందని వివరించారు. ఏపీ నుంచి అంతర్జాతీయ క్రీడాకారులను తయారుచేయడమే లక్ష్యంగా సిఎం చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారన్నారు. దానికి అనుగుణంగా క్రీడాకారులకు ప్రయోజనకరంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో క్రీడావసతులను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. క్రీడాకారుల భవిష్యత్తు రాష్ట్ర ప్రభుత్వ బాధ్యతని, జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో అత్యధిక పతకాలు సాధించి రాష్ట్ర కీర్తిప్రతిష్టతలను విస్తరింపజేయాల్సిన బాధ్యత క్రీడాకారులపైనే ఉందన్నారు.



శాప్ చైర్మన్ రవినాయుడుతో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ, తదితరులు

క్రీడాభివృద్ధి సంస్థ చైర్మన్‌ను కలిసిన ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: జగ్గయ్యపేటలో మెరుగైన క్రీడా సౌకర్యాల కోసం ఆంధ్రప్రదేశ్ క్రీడ అభివృద్ధి సంస్థ చైర్మన్ అనిమిని రవి నాయుడు, శాప్ ఎమ్‌డి పిఎస్ గిరీషాను సోమవారం శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య, పట్టణ మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర కలిశారు. ఈ సందర్భంగా జగ్గయ్యపేట పట్టణంలో ఉన్న స్విమ్మింగ్ పూల్‌ను మున్సిపాలిటీకి ఇవ్వాలని శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడును కోరారు. జగ్గయ్యపేటలో ఉన్న రెండు శాప్ క్రీడా ప్రాంగణాలను అభివృద్ధి చేస్తామని, సౌకర్యాలు మెరుగుపరుస్తామని అన్నారు. కావలసిన వసతులన్నీ కల్పించడానికి అధికారుల బృందాన్ని త్వరలో పర్యవేక్షణకు పంపిస్తామని వారు వచ్చి వారి నివేదిక సమర్పించాక అన్ని వసతులు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. త్వరలో జగ్గయ్యపేట ప్రాంతం నుంచి అత్యుత్తమ క్రీడాకారులను తయారు చేసే బాధ్యత, వారికి వసతులు, మౌలిక సదుపాయాలు కల్పిస్తామని శాప్ చైర్మన్, ఎమ్‌డి మాట ఇచ్చారని తెలిపారు.

బాధితుడికి పరామర్శ

ప్రజాశక్తి - వత్సవాయి :
పెనుగంచిప్రోలు మండలం అనిగండ్లపాడు గ్రామ మాజీ సొసైటీ అధ్యక్షులు పిడికిటి కోటేశ్వరరావు ఇటీవల అనారోగ్యంతో హైదరాబాదులో చికిత్స పొంది ఇంటికి వచ్చారు. విషయం తెలుసుకున్న జనసేన జిల్లా అధ్యక్షులు మాజీ ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను స్వగృహానికి వెళ్ళి పరామర్శించారు.

హెల్త్, ఎడ్యుకేషన్, న్యూట్రిషన్‌పై దృష్టి సారించాలి

కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

ప్రజాశక్తి - విజయవాడ : ఆకాంక్షిత బ్లాక్ కార్యక్రమం (ఏబీపీ) కింద కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిన జిల్లాలోని ఇబ్రహీంపట్నం, పెనుగంచిప్రోలు మండలాల్లో అభివృద్ధి ప్రణాళికల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. ఆకాంక్షిత జిల్లాలు, బ్లాక్‌లలో పురోగతిపై జిల్లా కలెక్టర్ లక్ష్మీ శ సోమవారం అధికారులతో కలెక్టరేట్ ఛాంబర్‌లో సమావేశమయ్యారు. ఇబ్రహీంపట్నం, పెనుగంచిప్రోలు బ్లాకులకు సంబంధించి ఐదు విభాగాల్లో 40 సూచికలకు సంబంధించి పురోగతిని మదించినట్లు తెలిపారు. సూచికల్లో ప్రగతికి అధికారులు సమన్వయంతో కృషిచేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. దేశంలోనే రెండు బ్లాకులను టాప్ టెన్‌లో నిలపాలన్నారు. ప్రస్తుతం పెనుగంచిప్రోలు 80 ర్యాంకు, ఇబ్రహీంపట్నం 100 ర్యాంక్‌లో ఉండడం పట్ల కలెక్టర్ అభినందించారు. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ దేశంలోనే రెండు బ్లాకులను టాప్ టెన్ లో నిరుపేలా కృషి చేయాలని అధికారులు ఆదేశించారు. ముఖ్యంగా హెల్త్, ఎడ్యుకేషన్, న్యూట్రిషన్‌పై దృష్టి పెట్టినట్లయితే టాప్ టెన్‌కు చేరుకునేందుకు ఎక్కువ అవకాశం ఉంటుందని కలెక్టర్ సూచించారు. సమావేశంలో ఇబ్రహీంపట్నం ఎంపీడీవో సునీత శర్మ పెనుగంచిప్రోలు ఎంపీడీవో శ్రీను, ఇబ్రహీంపట్నం బ్లాక్ కోఆర్డినేటర్ పి.శ్రీనివాస్, పెనుగంచిప్రోలు బ్లాక్ కోఆర్డినేటర్ బ్లాక్ కోఆర్డినేటర్ మోహన్ సందీప్ ఉన్నారు.

ముమ్మరంగా బీ ఫామ్ పట్టా రిజిస్ట్రేషన్లు

ప్రజాశక్తి - విజయవాడ : విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని నూతన భవనంలోని గ్రౌండ్ ఫ్లోర్‌లో జరుగుతున్న బీఫామ్ పట్ట రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముమ్మరం గా జరుగు తోందని ఇన్చార్జ్ కమిషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్ అన్నా రు. పాయికాపురం, కొత్త రాజరాజేశ్వరి పేటలో 10 సంవత్సరాలు నిండిన ఇంటి యజమానులకు బి ఫాం పట్టాను రిజిస్ట్రేషన్ చేసేందుకు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముమ్మరంగా జరుగుతుందని అన్నారు. ఇంకా రిజిస్ట్రేషన్ జరగవలసినవి 1171 ఉండగా, అందులో 371 రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేశారని తెలిపారు. ఇంకా ఎవరైతే రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చెసుకోవాలోవారు పూర్తి చేసుకుని ప్రభుత్వం వారు కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ప్రజలను కోరారు.



బి ఫాం పట్టాల రిజిస్ట్రేషన్లు ప్రక్రియలో అధికారులు

రాజధాని అభివృద్ధికి ఐఎఫ్‌సి 'ఎడ్జ్ అపెక్స్ సర్టిఫికేషన్'పై చర్చ

ప్రజాశక్తి - విజయవాడ : అమరావతిలో సుస్థిర అభివృద్ధి సాధనకు ఐఎఫ్‌సి "ఎడ్జ్ అపెక్స్ సర్టిఫికేషన్"పై పలువురు నిపుణులతో ఏపీ సీఆర్డీఏ అధికారులు సోమవారం సమావేశమయ్యారు. విజయవాడలోని ఎపిసిఆర్‌డిఎ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఈ సర్టిఫికేషన్, ప్రపంచ బ్యాంక్ గ్రూప్ అనుబంధ సంస్థ అయిన అంతర్జాతీయ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఎఫ్‌సి) అభివద్ధి చేసిన గ్రీన్ సర్టిఫికేషన్ వ్యవస్థ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందని సిఆర్‌డిఎ అధికారులు పేర్కొన్నారు. ఐఎఫ్‌సి ఎడ్జ్ సర్టిఫికేషన్ బృందంలో నిపుణులైన పంకజ్ కపూర్, ఫైజా సోలంకి ఈ సమావేశానికి నేతృత్వం వహించారు. ఎడ్జ్ అపెక్స్ సాఫ్ట్వేర్ ఉపయోగాలు, ప్రయోజనాలు, ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టుల్లో సుస్థిరమైన డిజైన్‌లను మెరుగుపరచడానికి ఈ సాఫ్ట్వేర్ ఎలా ఉపయోగపడుతుందో అధికారులకు కూలంకషంగా వివరించారు. ఈ సెషన్‌లో ఐఎఫ్‌సి "ఎడ్జ్ అపెక్స్ సర్టిఫికేషన్" గురించి వివరించిన నిపుణులు, మౌలిక వసతుల ప్రాజెక్టుల నిర్మాణంలో సుస్థిర అభివద్ధిని ప్రోత్సహించడం, ఆర్థిక విధానాల అమలు, కార్బన్ న్యూట్రాలిటీ, గ్రీన్‌హౌస్ గ్యాస్ ఉద్గారాల తగ్గింపు, గ్రీన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ పెట్టుబడులను ప్రోత్సహించడంపై పలు అంశాలను చర్చించారు. అదేవిధంగా అమరావతి గ్రీన్ సిటీ యాక్షన్ ప్లాన్‌లను రూపకల్పనపై కూడా సీఆర్డీఏ అధికారులతో చర్చించారు. సీఆర్డీఏ అదనపు కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీఆర్డీఏ గ్రూప్ డైరెక్టర్, ఇంజినీర్-ఇన్-చీఫ్ ఆర్.గోపాలకృష్ణ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.



ఆటల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

రాజ్యాంగ విశిష్టతపై పోటీలు

విజయవాడ : 26న రిపబ్లిక్ డే సందర్భంగా ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 75వ రిపబ్లిక్ డే సందర్భంగా రాజ్యాంగం గొప్పతనాన్ని చాటేందుకు పేటలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలుగులోకి తీసుకొచ్చేందుకు కెవిపిఎస్, పూలే-అంబేద్కర్ ట్యూషన్ పాయింట్ ఆధ్వర్యంలో 'ఆటల పోటీలు' నిర్వహించారు. మాచవరంలో పలు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు పేటలోని పెద్దలు, యువకులతోను 26న రాజ్యాంగ రక్షణ ర్యాలీ, ఈ ర్యాలీ అంబేద్కర్ భవన్, యారం వారి వీధి నుంచి సాయంత్రం 3 గంటలకు ప్రారంభం అవుతుందన్నారు. అనంతరం బహుమతుల ప్రదానోత్సవం అంబేద్కర్ భవన్లో జరుగుతుందన్నారు. బహుమతులు పంపిణీ కార్యక్రమానికి విజయవాడ చీఫ్ మెట్రోపాలిటిన్ మెజిస్ట్రేట్ ఎన్.రాజశేఖర్ ముఖ్య అతిథిలుగా హాజరవుతారన్నారు.

అభివృద్ధి పనులు, సమస్యలపై కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : జగ్గయ్యపేట నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనులు, సమస్యలపై సోమవారం జిల్లా కలెక్టర్ లక్ష్మీశను సోమవారం స్థానిక సంస్థలు శ్రీరామ్ రాజగోపాల్ కలిసి వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలో డిఎంఎఫ్ ఫండ్స్ విడుదల చేయాలని, జగ్గయ్యపేట పట్టణం, విలియంపేట రోడ్డులో ఉన్న డంపింగ్ యార్డ్ స్థలాన్ని మార్చడం లేక దుర్గంధపు వాసన రాకుండా శాశ్వత పరిష్కారం చేయాలని, సీలింగ్ ల్యాండ్‌ల వివరాలు తహశీల్దార్ కార్యాలయంలో ఉంచాలని, సీలింగ్‌లో ఉన్న ల్యాండ్‌లు, కోర్టులో ఉన్న ల్యాండ్‌లు కూడా కొందరు వ్యక్తులు ఆక్రమించుకొని అనుభవిస్తున్నట్లు అట్టి వాటిని అరికట్టి ఆ సమస్యలు త్వరగా పరిష్కరించాలని కోరారు. స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలని, ఐటీ పార్క్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ ను కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, టిడిపి పట్టణ ప్రధాన కార్యదర్శి మైనేని రాధాకృష్ణ, కౌన్సిలర్ నకరకంటి వెంకట్, నోముల రఘు తదితరులు ఉన్నారు.



కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ శ్రీరాం రాజగోపాల్

చిత్రకారుడు బొండా సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - భవానీపురం : సమాజంలోని అనేక అంశాలను సృజిస్తూ తన చిత్రకళ ద్వారా సమాజానికి సేవలందిస్తున్న ప్రముఖ చిత్రకారులు, గిరిజన గీత శిల్పి డాక్టర్ బొండా జగన్మోహనరావుకు అనేక ప్రముఖ సంస్థల వారు అవార్డులు ఇచ్చి సత్కరించడం అభినందనీయమని పశ్చిమ ఎంఎల్‌ఎ సుజనా చౌదరి కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ అన్నారు. సోమవారం సాయంత్రం భవానిపురం హౌసింగ్ బోర్డ్ కాలనీలోని బొండా ఆర్ట్ గ్యాలరీలో న్యూఢిల్లీకి చెందిన ది క్రేజీ టేల్స్ వారి ఇన్‌ఫ్లుయెన్షియల్ ఇండియన్ అవార్డు 2024, కలకత్తాకు చెందిన డ్రీమ్ పెయింట్ బ్రష్ వారి బెస్ట్ ఫర్ఫార్మర్ ఆఫ్ ది ఇయర్ అవార్డులు గెలుపొందిన బొండా జగన్మోహనరావును శ్రీధర్ శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ ఆయనకు భవిష్యత్తులో మరిన్ని కీలకమైన అవార్డులు లభించాలని ఆకాంక్షించారు. ప్రముఖ రాజకీయ నాయకులు ఆకుల శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ సమాజసేవే లక్ష్యంగా బొండా జగన్మోహనరావు తన చిత్రకళ ద్వారా అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని ప్రశంసించారు. బొండా చిత్రాలు సామాజిక దక్పథంతో ఉంటాయని అన్నారు. గిరిజనులకు తన చిత్రాలు ద్వారా బొండా చేస్తున్న సేవలు ఎనలేనివని కొనియాడారు. బొండా జగన్మోహనరావు మాట్లాడుతూ నాగరిక సమాజానికి దూరంగా బ్రతుకుతున్న గిరిజనుల జీవితాలను అభివద్ధి చేయాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజల జీవిత విధానాలను తన చిత్రాల ద్వారా ప్రపంచానికి చాటి చెప్పడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో దుర్గా బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్ అల్లం పూర్ణచంద్రరావు, ప్రముఖ కళాకారులు దామోదర గణపతిరావు, ఆర్.అనీల్, పివి.నాగరాజు తదితరులు పాల్గొని బొండాకు అభినందనలు తెలిపారు.



చిత్రకారుడు బొండా జగన్మోహన్‌రావును అభినందిస్తున్న దృశ్యం

కత్తులతో వీరంగం

ప్రజాశక్తి - వత్సవాయి : పెనుగంచిప్రోలు మండల వైసిపి అధ్యక్షుడు శ్రీకాంత్, భాస్కరరావు ఇంటి వద్ద ఇరువురు వ్యక్తులు ఆదివారం అర్ధరాత్రి 11 గంటల సమయంలో కత్తులతో వీరంగం చేశారు. ఈ మేరకు కనకపూడి భాస్కరరావు పెనుగంచిప్రోలు పోలీస్ స్టేషన్లో సోమవారం ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన దోసపాటి చరణ్, కోట చరణ్ భాస్కరరావు ఇంటి ఆవరణలోనికి అక్రమంగా కత్తులతో ప్రవేశించి భాస్కర్ రావు ఇంటి తలుపుల కొడుతూ, తీవ్రమైన దుర్భాషలాలతో వీరంగం సృష్టించారు. తలుపులు పెద్ద ఎత్తున కొట్టడంతో తీవ్ర ఆందోళనకు గురైన భాస్కర్‌రావు దంపతులు బిగ్గరగా కేకలు వేశారు. ఇరుగుపొరుగు కుటుంబాల వారు అక్కడకు చేరుకోగా ఆ సమయంలో భాస్కరరావు ఇంటి తలుపులు తీశారు. ఆ సమయంలో కోటా చరణ్, దోసపాటి చరణ్ భాస్కర్‌రావుపై దాడికి ప్రయత్నించగా స్థానికులు అడ్డుకున్నారు. దీంతో వారు కత్తులతో బెదిరిస్తూ పారిపోయారు.

అధ్వానంగా డొంక రోడ్లు

వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు రైతుల ఇక్కట్లు



ప్రజాశక్తి-గన్నవరం: వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు ప్రధాన ఆధారం డొంకరోడ్లు. ఈ రోడ్లు సక్రమంగా లేకపోతే రైతుల బాధలు చెప్పనలవు కావు. రైతులు వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు వినియోగించే డొంక రోడ్లు ఆధ్వానంగా మారాయి. వీటిని బాగుచేయించాల్సిన ప్రభుత్వం, వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయి. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గన్నవరం మండలంలో 21 గ్రామాలు ఉండగా, వీటిల్లో 18 వేల ఎకరాలలో వరి సాగు అవుతోంది. ఉద్యాన పంటలైన మామిడి, కూరగాయలు, ఇతర పంటలు 5 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ప్రతి రోజు ఈ భూముల్లోకి వెళ్లాలంటే డొంక రోడ్డే ఆధారం. ముస్తాబాద ఆయకట్టు ఐదు వేల ఎకరాలకు పైగానే ఉంది. మాదలవారిగూడెం, సూరంపల్లి, సావరగూడెం. పురుషోత్తపట్నం, కొండపావులూరు, గొల్లనపల్లి, బీబీగూడెం, గోపవరపుగూ డెం, చిక్కవరం తదితర గ్రామాల్లో డొంక రోడ్లు కనీసం ఊరికి ఐదుకు పైగా ఉన్నాయి. విత్తనం చల్లింది మొదలు పంట కోసే వరకు, పంట ఉత్పత్తులను తరలించే వరకూ ఈ డొంక రోడ్డే ఉపయోగిస్తుంటారు. విత్తనాలు తీసుకువెళ్లేందుకు, దుక్కులు దున్నేందుకు, మందు చల్లేందుకు, సాగునీరు పెట్టేందుకు నిరంతరం ట్రైరు బండ్లు వెళ్తాయి.

అధ్వానంగా డొంక రోడ్లు

గోతులమయంగా డొంక రోడ్డు ఉంది. ట్రాక్టర్లు, లారీలు, ద్విచక్రవాహనాలు, ఈ రోడ్లపై రాకపోకలు సాగిస్తుంటాయి.తెంపల్లి నుంచి బీబీగూడెం వచ్చే డొంక రోడ్లు అధ్వా నంగా ఉన్నాయి. ముళ్లచెట్లతో రోడ్లు కుంచించుకు పోయాయి. రోడ్లు గుంతలు పడిపోయి ఉన్నాయి. అన్ని గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి. కనీసం ఈ వేసవిలో డొంక రోడ్ల దుస్థితిపై అధికారులు దష్టి పెట్టాలని రైతాంగం కోరుతున్నారు.

మార్కెట్ కమిటీ నిర్లక్ష్యం

డొంక రోడ్ల నిర్మాణానికి వ్యవసాయ మార్కెట్ యార్డులు నిధులు సమకూర్చే ఆనవాయితీ ఉంది. ఆ మేరకు నిధులు కేటాయించి రోడ్లు నిర్మించాలి. ఇబ్బందులు లేకుండా వ్యవసాయ ఉత్పత్తుల రవాణాను ప్రోత్సహించి రైతులను ఆదుకోవాలి.

పంట కాలువలు బాగు చేయాలి

ఏటా వేసవిలో ఎస్ఆర్ఆజీఎస్ పనుల ద్వారా పంట కాలువలు బాగు చేస్తారు. ఈ సంవత్సరం డొంక రోడ్లు పక్కనే ఉన్న పంట కాలువలు బాగు చేయిం చాలని, ఆక్రమణలు తొలగించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఆక్రమణలు తొలగించాలి..పలు గ్రామాల్లో డొంక రోడ్లు ఆక్రమణలకు గురి అయ్యాయి. వంట కాలువలు పరిమాణం తగ్గి పోయాయి. ఏ గ్రామానికి ఆ గ్రామంలో వీఆర్వో డొంక రోడ్లను సర్వే చేయాలి. వ్యవసాయ



ఉత్పత్తుల రవాణా డొంక రోడ్లపైనే ఆధారపడి ఉంది. పండిం చిన ధాన్యం తరలించాలం టే ఈ రోడ్లే శరణ్యం. పంట కాలువలు కూడా బాగుచేయించాలి. ఎస్ఆర్జీఎస్ ద్వారా డొంక రోడ్లు, పంట కాలు వలు బాగు చేయాలి. రైతులకు మేలు చేసే పంట కాలువలు, డొంక రోడ్లను ఆధునికీకరించాలి. ఎస్ఆర్ ఈజీఎస్ ద్వారా ఎస్టిమేట్లు వేయాలి. ఈ వేస విలో డొంక రోడ్ల నిర్మాణం పూర్తి చేయాలి. డొంక రోడ్లు, పంట కాలువలు సర్వే చేయించి కాపాడాలని రైతాంగం కోరుతున్నారు. సూరంప ల్లి, ముస్తాబాద, మాదలవారిగూడెం గ్రామాల్లో పరిశ్రమల వ్యర్థాలు పంటకాలువల్లో, డొంక రోడ్లలో వేస్తున్నారు. గ్రామాల్లోకి వెళ్లే ప్రధాన రహదారుల వెంట పెద్దపెద్ద వంట కాలువలుంటాయి. వాటిని సర్వే చేసి ఆక్రమణల చెర నుంచి కాపాడాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

పిట్టలంకలో రీసర్వే ప్రారంభం

ప్రజాశక్తి-కోడూరు: భూ వివాద సమస్యలను పరిష్కరించడం కోసమే కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూముల రీసర్వే చేపట్టినట్లు కోడూరు మండల తహసిల్దార్ శ్రీను నాయక్ తెలిపారు. సోమవారం కోడూరు మండల పరిధిలోని పిట్టలంక గ్రామంలో భూ రీ సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ సర్పంచ్ కనగాల వెంకటేశ్వరరావు అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించి గ్రామ పురవీధులలో ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ రికార్డు ప్రకారం రైతుల డాక్యుమెంటులను పరిశీలించి, సర్వే నిర్వహించి, సరిహద్దులు తేల్చి, రాళ్లు వేసి నూతనంగా పట్టాదారు పాసుపుస్తకాలు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ సర్వే డిప్యూటీ తహశీల్దార్ పద్మప్రియ, ఆర్ఐ సుభాషిని, వీఆర్వో గోపాలకృష్ణ పాల్గొన్నారు.



గుడివాడ డిఎస్పిగా ధీరజ్‌వినీల్



ప్రజాశక్తి-గుడివాడ: గుడివాడ సబ్ డివిజన్ కార్యాలయ నూతన డిఎస్పీగా వి.ధీరజ్‌వినీల్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. స్థానిక రాజేంద్రనగర్‌లోని డిఎస్పీ కార్యాలయంలో అధికారికంగా బాధ్యతలు చేపట్టిన ధీరజ్ వినిల్‌కు సబ్ డివిజన్ పరిధిలోని సిఐలు, ఎస్సైలు, పోలీస్‌లు పుష్పగుచ్ఛాలు అందజేశారు.

టిడ్కో లబ్ధిదారుల నిరసన

ప్రజాశక్తి-గుడివాడ : గుడివాడ టిడ్కో కాలనీ లబ్ధిదారులకు ఇచ్చిన మాట ప్రకారం ఋణమాఫీ, అభివద్ధికి రూ.250 కోట్లు ప్రత్యేక గ్రాంట్ విడుదల చేయాలని కోరుతూ టిడ్కో కాలనీ అభివద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సోమవారం స్థానిక ఆర్‌డివో కార్యాలయం వద్ద అభివృద్ధి కమిటి కార్యదర్శి బసవ అరుణ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు టిడ్కో లబ్ధిదారుల రుణాలు రద్దు చేయాలన్నారు. టిడ్కో గృహాలకు ఓవర్ హెడ్ ట్యాంక్ నుండి ప్రతిరోజు త్రాగునీరు విడుదల చేయాలని, ప్రతి బ్లాక్ వద్ద బోరు పంపులను ఏర్పాటు చేయాలని, స్కూల్, హాస్పటల్, సచివాలయం, కళ్యాణమండపం, పోలీసుస్టేషన్ తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. టిడ్కో గృహాలకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయకుడదని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్‌డివో కార్యాలయం ఏఓకు 26 డిమాండ్లు ఉన్న వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడ్కో గృహాల సభ్యులు పాల్గొన్నారు.



తొమ్మిది గంటలు ఉచిత విద్యుత్ ఇవ్వాలి

ఎపి కౌలు రైతుల సంఘం డిమాండ్

ప్రజాశక్తి-కంకిపాడు: వరదలు, వరుస తుపాన్లతో నష్టపోయి ఉన్న రైతాంగానికి రోజుకు తొమ్మిది గంటల ఉచిత విద్యుత్ ఇవ్వాలని ఎపి కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు డిమాండ్ చేశారు. కంకిపాడు ఎంఎన్‌బి రెడ్డి భవనంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆగస్టులో వచ్చిన వరదల వల్ల కృష్ణానదీ పరివాహక ప్రాంతంలో పంటలు దెబ్బతిన్నాయన్నారు. ప్రభుత్వ నుండి వచ్చిన సహాయం అరకొరగానే అందిందన్నారు. ఎకరానికి రెండు నుండి నాలుగు లక్షల వరకు పెట్టుబడి పెట్టి కంద, పసుపు మొదలగు పంటలు వేస్తే మొత్తం వరదల్లో మునిగిపోయి రైతులు ఏమాత్రం కోలుకోలేని పరిస్థితిలో ప్రభుత్వం ఇచ్చిన సహాయం ఎకరానికి 14 వేలు రూపాయలు మాత్రమేనన్నారు. అనంతరం ప్రత్యామ్నాయ పంటలు వేసుకొని వారి నష్టాన్ని కొంతవరకు తగ్గించుకునే ప్రయత్నం చేస్తుంటే ప్రభుత్వం రోజుకు ఏడు గంటలు మాత్రమే విద్యుత్ ఇవ్వడం వల్ల రైతులు ఆవేదన చెందుతున్నారని చెప్పారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తొమ్మిది గంటలు విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. ఈ సమావేశంలో రైతు సంఘం మండల కార్యదర్శి వి శివశంకరరావు, జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్ శ్రీహరి, కౌలు రైతుల సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు జె రవి, వి మరియుదాసు, వై జోజి పాల్గొన్నారు.





ఐద్వా కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఉయ్యూరు: ఐద్వా నూతన సంవత్సర కేలండర్‌ను స్త్రీల వైద్య నిపుణులు డాక్టర్ అరుణకుమారి సోమవారం ఉయ్యూరులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అరుణ మాట్లాడుతూ స్త్రీలు విద్యావంతులు అయితే సమాజ మార్పు జరుగుతుందన్నారు. సావిత్రి భాయ్ పులే మహక్షన్నతమైన కృషి చేశారని, మానికొండ సూర్యావతి, నాగళ్ల రాజేశ్వరమ్మ మహిళల హక్కుల కోసం ఉద్యమాలు నిర్వహించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు బి.వేణు కుమారి, రజిని, జిల్లా కమిటీ సభ్యులు నాగమణి, ప్రశాంతి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గోడపత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి-గుడివాడ: సిపిఐ శత వార్షికోత్సవాల గోడపత్రిక ఆవిష్కరణ కార్యక్రమం స్థానిక మల్లాయిపాలెం పంచాయితీ కార్యాలయం సమీపంలో సిపిఐ నాయకులు కొమ్ముల సురేష్, షేక్ మూసాలు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలలోను గోడ పత్రిక ఆవిష్కరణలు జరిపి పార్టీకి విశేష ప్రచారం కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ జిలానీ, గణేష్, జరీనా సుల్తానా, చిట్టెమ్మ తదితరుల పాల్గొన్నారు.

కాల్వలో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-కంకిపాడు: ఈడుపుగల్లు గ్రామం బీసీ కాలనీ కాలువ కట్టమీద నివాసం ఉండే షేక్ ఏసుబాబు (38) గోసాల పాత వంతెన మీదగా నడుచుకుంటూ వెళుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి బందరు కాలువలో పడిపోయాడు. అతని ఆచూకీ గురించి బందరు కాలువ పరిసరాల్లో గాలింపు చర్యలు చేపట్టగా గోసాల వంతెన దగ్గరలో పోలీసులు మృతదేహాన్ని కనుగొన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉయ్యూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.


చెత్త సేకరణ వ్యాన్ డ్రైవర్ల నిరసన

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీలో తడి పొడి చెత్త సేకరించే వ్యాన్ డ్రైవర్లకు మూడు నెలలు అవుతున్నా జీతాలు ఇవ్వకపోవడంతో ఈ నెల 10వ తేదీ నుండి 42 మంది వ్యాన్ డ్రైవర్లు సమ్మెబాట పట్టారు. దీనిలో భాగంగా సోమవారం కానూరు నాలుగు రోడ్లు సెంటర్లో డ్రైవర్లు నిరసన తెలిపారు. వీరికి మద్దతుగా మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెనమలూరు మండలం సిఐటియు కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తులు మాట్లాడుతూ కమిషనర్ హామీ మేరకు ఐదు రోజుల్లో జీతాలు వేస్తామని చెప్పినా నేటికీ జీతాలు జమ చేయలేదని, వెంటనే అధికారులు స్పందించి కార్మికులు సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మస్తాన్‌వలి, వెంకటరెడ్డి, శ్రీహరి, సత్రం శీను, దినేష్, రాజు, లింగయ్య, నాయక్ తదితరులు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి-గుడివాడ: విద్యావికాస్ పబ్లిక్ స్కూల్‌లో 2010లో 10వ తరగతి విద్యను అభిసించిన విద్యార్థులు డైరెక్టర్లు ముప్పాల సుబ్బారావు, బొప్పన సాంబశివరావులతో కలసి గొప్ప అనందాన్ని పంచుకున్నారు. సోమవారం స్థానిక బైపాస్‌రోడ్డులోని విద్యావికాస్ పాఠశాల ప్రాంగణంలో పూర్వ విద్యార్థులు పునఃకలయికను నిర్వహించడంతో జ్ఞాపకాలు ఆనందంతో ప్రాంగణం ఆత్మీయంగా మారింది. ఈ కార్యక్రమం పూర్వ విద్యార్థులు 15 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఉమ్మడి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని చిన్నతనం జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. విద్యా బుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కతిక కార్యక్రమాలు, ఆత్మీయ కలయిక విద్యా వికాస్ పబ్లిక్ స్కూల్‌లో పండగ వాతవరణాన్ని తీసుకువచ్చింది.



మధ్యాహ్న భోజనం పరిశీలన

ప్రజాశక్తి-చల్లపల్లి (మొవ్వ): కృష్ణా జిల్లా కలెక్టర్ డికె బాలాజీ, పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా మొవ్వలోని శ్రీ మండల కనకయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సోమవారం ఆకస్మికంగా మధ్యాహ్న భోజన వేళలో సందర్శించారు. పిల్లలతో కలిసి సహపంక్తిలో భోజనం చేసిసంతప్తి వ్యక్తపరిచారు. విద్యార్థినీ విద్యార్థులతో ముచ్చటించి విషయాలు తెలుసుకున్నారు. తదుపరి పాఠశాలకు దాతలు సమకూర్చిన ఎలక్ట్రిక్ రైస్ కుక్కర్ ఆర్ఓ ప్లాంట్ మరియు సర్వింగ్ ప్లాట్ఫాములను పరిశీలించారు. తదుపరి పాఠశాలలోని గణిత ఉపాధ్యాయిని మేకా రాణి చే నిర్వహించబడుతున్న గణిత లాబ్ ను పరిశీలించి అనేక నమూనాలను చూసి సూచనలు చేసీ, ఉపాధ్యాయిని చేస్తున్నది చాలా మంచి ప్రయత్నమని అభినందించారు. తర్వాత అటల్ టింకరింగ్ ల్యాబ్ ను సందర్శించి ప్రభుత్వ పాఠశాలలకు ఇదొక మంచి వరమని ప్రభుత్వ పాఠశాలల్లో ఇలాంటి ల్యాబ్లు ఉండడం అదృష్టమని తెలియజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎస్.శ్రీదేవి మరియు సిబ్బందిని అభినందించినారు. కార్యక్రమంలో స్థానిక తహసిల్దార్ మస్తాన్,ఎంపిడి జె.విమలదేవి, అధికారులు ప్రజాప్రతినిధులు జడ్పిటిసి కోఆప్షన్ సభ్యులు వేమూరి పరిశుద్ధ రాజు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంఎల్ఎ, కలెక్టర్



నూరుద్దీన్‌ను అభినందిస్తున్న సౌమ్య

నూరుద్దీన్‌కు అభినందనలు

ప్రజాశక్తి - నందిగామ : గ్రూప్ ఎక్సర్‌సైజ్ లీడర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు గ్రహీత మహ మ్మద్ నూరుద్దీన్‌ను ఎపి ప్రభుత్వ విప్ ఎంఎల్‌ఎ తంగిరాల సౌమ్య సోమవారం అభినందిం చారు. భారతదేశపు అత్యంత ప్రతిష్టాత్మకమైన (కాలిషన్ ఆఫ్ ఎక్సర్‌సైజ్ ప్రొఫెషనల్స్ ఆఫ్ ఇండియా అవార్డ్ 2025 అందుకున్న నందిగామ ఎరోబిక్ గురువు మహమ్మద్ నూరుద్దీన్ సోమవారం ఏపీ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రూప్ ఎక్సర్‌సైజ్ లీడర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు అందుకున్న నూరుద్దీన్‌కు తంగిరాల సౌమ్య శుభాకాంక్షలు తెలిపారు. నందిగామ జిల్లా పరిషత్ హైహైస్కూల్లో 2016 నుండి ఇప్పటివరకు ఉచితంగా వ్యాయామాలు చెబుతూ ఇలా ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్, మరెన్నో అవార్డులతో, నందిగామకు మంచి పేరు తీసుకురావటం అభినందనీయమన్నారు.



ఆలయ నిర్మాణానికి రూ.5 లక్షలు విరాళం

ప్రజాశక్తి - మైలవరం : మైలవరం మండలంలోని అనంతవరం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శివాలయానికి ఎపి మాజీస్పెషల్ రిప్రజెంటివ్ ఫర్ నార్త్ అమెరికా కోమటి జయరాం, టిడిపి రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి కోమటి సుధాకర్‌రావు సోమవారం ఆలయ కమిటీ వారికి రూ.5 లక్షల విరాళాన్ని అందజేశారు. శ్రీ లక్ష్మీ స్టోన్ క్రషర్ నిర్వాహకులు ఎలమంచిలి వెంకటరత్నం రూ.2.5 లక్షల విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ వారు మాట్లాడుతూ నూతనంగా నిర్మిస్తున్న శివాలయానికి దాతలు స్పందించి విరాళాలు అభినందనీయమన్నారు. విరాళాలు అందజేసిన దాతలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో చనమోలు రాజశేఖర్, కమిటీ నిర్వాహకులు బొందలపాటి సుధాకర్ రావు, బూదేటి రామారావు, కోడి శ్రీనివాసరావు, జొన్నలగడ్డ అప్పారావు, పమిడి సూర్యప్రకాశ్రావు, గ్రామ ప్రజలు స్థానికులు పాల్గొన్నారు.

ట్రై సైకిళ్లు పంపిణీ

ప్రజాశక్తి - వత్సవాయి : అనిగండ్లపాడులో జనసేన నాయకులు సెంట్రల్ ఆంధ్ర జోన్ కన్వీనర్ బాడిత శంకర్ సుమారు రూ.30వేలతో ఏర్పాటు చేసిన ట్రై సైకిల్స్‌ను జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభాను చేతుల మీదుగా పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన వికలాంగులు శాఖముడి చుక్కమ్మ, కోట ప్రభ కుమార్, నునావత్ కార్తీక్ కు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ జనసేన నాయకులు బాడిత శంకర్ మంచి సేవా స్వభావం ఉన్న వ్యక్తి అని, విజయవాడ పట్టణంలో కూడా ఇలాంటి సేవా ఎన్నో కార్యక్రమాలు చేస్తున్నారని తెలిపారు.



గండేపల్లిలో రీ సర్వే ప్రారంభం

ప్రజాశక్తి - కంచికచర్ల : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా రెవెన్యూ అధికారి సూచనలతో కంచికచర్ల మండల తహశీల్దార్ సారధ్యంలో సోమవారం కంచికచర్ల మండలం గండేపల్లి గ్రామంలో వ్యవసాయ, ప్రైవేటు భూముల రీ సర్వే ప్రక్రియ ప్రారంభించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ పి.జాహ్నవి మాట్లాడుతూ పైలెట్ ప్రాజెక్టులో భాగంగా రీ సర్వే ప్రక్రియ జరుగుతుందని, గ్రామాన్ని బ్లాకులుగా విభజించి రీ సర్వే ప్రక్రియ చేపడతామన్నారు.. ప్రతి బ్లాక్‌లో 250 ఎకరాలు అధిగమించకుండా సర్వే జరుగుతుందని తెలిపారు. ప్రతి బ్లాక్లో ఇద్దరు సర్వేయర్లు, వీఆర్వో, విఆర్‌ఎలను బృందంలా ఏర్పాటు చేశామన్నారు. వ్యవసాయ భూముల యజమానులను వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేసి హద్దులు విషయంలో జాగ్రత్త పాటించనునట్లు వివరించారు. యజమాని ఫీల్డ్‌కు రాలేకపోతే వాట్సాప్ కాల్‌లో హద్దులు చూపించే అవకాశం కల్పించినట్లు తెలిపారు. రీ సర్వే జరిగిన తర్వాత రాజముద్రతో కొత్త పాసుబుక్ క్యూఆర్ కోడ్‌తో జారీ చేస్తామన్నారు. ఈ కార్యక్లమంలో సర్వేయర్ భాను, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



గండేపల్లిలో రీ సర్వే పరిశీలిస్తున్న తహశీల్దార్

లైసెన్స్ లేకుండా వాహనాలు నడపొద్దు

వాహనదారులకు పోలీసుల హెచ్చరిక

ప్రజాశక్తి - మైలవరం : డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపొద్దని అలాంటి వాహనాలను సీజ్ చేస్తామని సిఐ దాడి చంద్రశేఖర్ హెచ్చరించారు. స్థానిక పంచాయతీ కార్యాలయం సమీపంలో సోమవారం సాయంత్రం హెల్మెట్, డ్రైవింగ్ లైసెన్స్, త్రిబుల్ రైడ్ చేస్తూ బైకులు నడుపుతున్న మైనర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు బైకులు ఇవ్వరాదని లైసెన్స్ లేకుండా నడిపితే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. మొత్తం 20 బైకులను సీజ్ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, పలువురు వాహనదారులు పాల్గొన్నారు.

తిరువూరు : మనసు, శరీరం ఒకే విధంగా పనిచేయాలని, అతివేగంతో వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలకు గురవుతున్నారని ఎస్ఐ సత్యనారాయణ అన్నారు. జిల్లా స్థాయి ట్రాఫిక్ వాలంట రింగ్ కార్యక్రమం తిరువూరు శ్రీ వాహిణి ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం జరిగింది. ప్రమాదాలకు అడ్డుగట్ట వేయడానికి ప్రభుత్వం ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటుందని ఎస్ఐ తెలి పారు. హెల్మెట్, సీట్ బెల్ట్ వంటి భద్రతా నియ మాలను పాటించి ట్రిపుల్ రైడింగ్ డ్రంక్ అండ్ డ్రైవ్ వంటి వాటిని నిర్మూలిస్తున్నామన్నారు.



మైలవరంలో వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ఉచిత పశు వైద్య శిబిరాలు



కంచికచర్లలో పశువులకు టీకాలు వేస్తున్న దృశ్యం



గంపలగూడెంలో పశువులకు టీకాలు వేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - కంచికచర్ల : జిల్లాలో పశుసంరక్షణ వైద్య ఆరోగ్య ఆధ్వర్యంలో మండలంలో గల గొట్టుముక్కల గ్రామంలో సోమవారం పశు, జంతు వైద్య శిబిరాన్ని జిల్లా పశుసంవర్ధక శాఖ సంయుక్త సహాయకులు ఎం.హనుమంతరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ గోశాల లేదా గోకులాలు పశు సంరక్షణకు తోడ్పడతాయన్నారు. బహు వార్షిక పశుగ్రాస సెంటర్లు, మేలు జాతి పశువులను పుట్టించడం కోసం లింగ నిర్ధారిత వీర్య సరఫరా, పశుపోషక క్రెడిట్ కార్డుల పంపిణీ, సైలేజి ఉత్పత్తి నిమిత్తం 50శాతం రాయితీతో మినీ శైలేజి యూనిట్లను రైతులకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో పశువులకు గర్భకోశ వ్యాధులు, దూడల్లో నట్టల నివారణ, గొర్రెలు మేకలు నట్ట నివారణ, వ్యాధి నివారణ టీకాలు 600 పశువులకు ఇచ్చారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్లు, పశు సంవర్ధక శాఖ సిబ్బంది మోషన్స్, వెస్లీ, వెంకట్రావు కష్ణమూర్తి, నవీన్ కుమార్, జి.అనిల్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తుళ్ళిమలి రాజకుమార్ ఉపసర్పంచ్ గోగినేని అమర్నాథ్ మండల పరిషత్ సభ్యురాలు గోగినేని సరస్వతి రంగారావు పాల్గొన్నారు.

నెమలిలో పశు ఆరోగ్య శిబిరం

గంపలగూడెం: నెమలి గ్రామంలో సోమవారం పశుఆరోగ్య శిబిరాన్ని నిర్వహించినట్లు పశు వైద్యులు డాక్టర్ అభిలాష్ తెలిపారు. ఈ శిబిరంలో 30 గేదెలకు సూడి పరీక్షలు నిర్వహించగా, ఎదకు రాని 20 గేదెలకు ప్రత్యేక చికిత్స నిర్వహించినట్లు చెప్పారు. 60 ఆవులకు వ్యాక్సిన్ ఇవ్వగా, 435 గొర్రెలు– మేకలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామ సర్పంచ్ డి.రామకృష్ణ గ్రామ పెద్దలు ఎహెచ్‌ఎలు పాల్గొన్నారు.

ఇంటింటికీ తాగునీటి సౌకర్యమే లక్ష్యం : ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలోని స్థానిక విలియంపేటలో స్థానిక శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య పట్టణ మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రతో కలిసి పర్యటించారు. స్థానిక విలియంపేటలోని ఒక ప్రాంతంలో మంచినీటి సదుపాయం సరిగా రావట్లేదని ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం ఉదయం ప్రతి ఇంటికి వెళ్లి వారి ఇబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్ మాట్లాడుతూ ప్రతి ఇంటికి వెళ్లి మంచినీటి సదుపాయాలు, పైప్‌లైన్ గమనించారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు మంచినీటి సదుపాయం బాగానే ఉందని ఎత్తు ప్రాంతంలో ఉన్న కొందరికి మంచినీరు సరిగా అందడం లేదని స్థానికులు తెలిపారు. మంచినీరు సక్రమంగా రాని వారికి మంచినీటి సదుపాయం పూర్తిస్థాయిలో వచ్చేలా చర్యలు తీసుకుంటామని, జగ్గయ్యపేట పట్టణ ప్రజలందరికీ, ఇంటి ఇంటికి మంచినీరు సదుపాయం కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. పైపులైన్లు, పైపులైను మరమ్మత్తులు, హెడ్ వాటర్ వర్క్స్ లను పూర్తిస్థాయిలో పర్యవేక్షిస్తున్నామని ప్రజలు తమకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ కౌన్సిలర్లు, మున్సిపల్ సచివాలయ సిబ్బంది, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పైపులైన్లను గమనిస్తున్న ఎంఎల్‌ఎ, మున్సిపల్ చైర్మన్



అచ్చెన్నాయుడిని కలిసి సమస్యలు వివరిస్తున్న పిఎసిఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నేతలు

సమస్యలపై అచ్చెన్నాయుడిని కలిసిన నేతలు

ప్రజాశక్తి - తిరువూరు : ఆంధ్రప్రదేశ్ పిఎసిఎస్ ఎంప్లాయిూస్ అసోసియేషన్ నేతలు రాష్ట్ర సచివాలయంలో సహకార శాఖ మంత్రి అచ్చెన్నాయుడును కలిసి తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. సహకార సంఘం ఉద్యోగులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన రెండు మూడు రోజుల్లో ఈ సమస్యలపై అసోసియేషన్ నేతలతో సమావేశం నిర్వహించి చర్చిస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొల్లినేని బి.రఘురాం తెలిపారు.

గ్రామ సభల్లో 595 అర్జీలు

ప్రజాశక్తి - గంపలగూడెం : గత నెలలో ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు నిర్వహించిన గ్రామసభల్లో మండల వ్యాప్తంగా 595 అర్జీలు వచ్చినట్లు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వీరభద్రరావు తెలిపారు. అందులో భూ సర్వే, అచ్చు తప్పులు, పాసుబుక్కులు, ప్రభుత్వ – ప్రైవేటు భూముల మార్పు – చేర్పులు, విస్తీర్ణ వ్యత్యాసాలు, తదితర అంశాలతో కూడిన అర్జీలు వచ్చినట్లు వీరభద్రరావు వివరించారు. వీటిని ప్రభుత్వం ఇచ్చిన నిర్ణీత సమయంలో జవాబు చెప్పేందుకు రెవెన్యూ అంతరంగం పనిచేస్తున్నట్లు చెప్పారు. దాదాపు వచ్చిన సమస్యలపై పరిష్కార దిశగా పనిచేస్తున్నట్లు వీరభద్రరావు వివరించారు.

సోషల్ ఆడిట్‌పై కోఆర్డినేషన్ సమావేశం

ప్రజాశక్తి - గంపలగూడెం : 20 23–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పనుల్లో సోషల్ ఆడిట్ నిర్వహణలో భాగంగా కోఆర్డినేషన్ మీటింగ్ జరిగినట్లు ఎపిఒ వి.వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక మండల పరిషత్‌లో జరిగిన ఈ సమావేశానికి స్టేట్ రిసోర్స్ పర్సన్ సూర్యనారాయణ పాల్గొని పలు సూచనలు చేశారు. ఉపాధి హామీ పనులతో పాటు వివిధ శాఖల అనుసంధానంగా జరిగిన పనులపై ఈ ఆడిట్ ఉంటుందన్నారు. ఎంపిడిఒ పివిఎస్ నాగేశ్వరరావు మాట్లా డుతూ జరిగిన పనుల్లో ఎటువంటి వ్యత్యాసాలు లేకుండా చూడాలని ఆదేశించారు. పంచాయతీరాజ్ ఎఇ రేగళ్ల పూర్ణచంద్రరావు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అబ్దుల్ గఫర్ ఖాన్ వర్ధంతి

ప్రజాశక్తి - గంపలగూడెం : స్థానికంగా ఉన్న కృష్ణవేణి ఇఎం స్కూల్‌లో భారతరత్న అవార్డు గ్రహీత అబ్దుల్ గఫర్ ఖాన్ 65వ వర్ధంతి సోమవారం ఘనంగా నిర్వహించినట్లు ఆ పాఠశాల డైరెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రసన్నలక్ష్మి పాల్గొని గఫార్ ఖాన్‌ను సరిహద్దు గాంధీగా పిలుస్తారని, దేశ విభజన వ్యతిరేక పోరాటంలో గఫ్బర్ ఖాన్ ప్రత్యేక పాత్ర పోషించినట్లు వివరించారు.

సహజ వనరులను వినియోగించుకోవాలి : కొల్లు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): మైనింగ్ రంగంలో కొత్త లక్ష్యాలతో ముందుకు సాగినపుడు మాత్రమే మెరుగైన ఫలితాలను సాధించే అవకాశం ఉంటుందని భువనేశ్వర్‌లో నిర్వహించిన నేషనల్ మైనింగ్ మినిస్టర్స్ సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. సస్టైనబుల్ మైనింగ్ ఫర్ వికసిత్ భారత్ మూడో కాన్ఫరెన్స్ సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. రాష్ట్రంలో మైనింగ్ రంగంలో ఉన్న అపార అవకాశాలు, క్రిటికల్ మైనింగ్ ఆవశ్యకతను మంత్రి కొల్లు రవీంద్ర వివరించారు.దేశస్థాయిలో మైనింగ్ శాఖల సదస్సుల ద్వారా రాష్ట్రాలు తమ సూచనలను, పాలసీలను, అవసరాలను, ఆకాంక్షలను పరస్పరం పంచుకోవడానికి అవకాశం కలుగుతుందన్నారు.



మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

డీఎంఎఫ్ ద్వారా రాష్ట్రంలోని ప్రజల జీవన ప్రమాణాల పెంపు సహా సమగ్రాభివద్ధికి ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉందన్నారు. ఇనుప ఖనిజం, బాక్సైట్, లైమ్ స్టోన్ లాంటి కీలక మినరల్స్ ఎగుమతిలో తమదైన ముద్ర వేసుకున్నాం అన్నారు.ప్రస్తుతం మారిన కాలానికి అనుగుణంగా సోలార్, విండ్, సెమీ కండక్టర్స్ లాంటి రంగాల్లో మనం ముందంజ వేయాల్సిన సమయం వచ్చిందన్నారు. అందుకోసం క్రిటికల్ మినరల్స్ ఉత్పత్తి, ప్రాసెసింగ్‌పై దష్టి సారించాలని తద్వారా దిగుమతులపై ఆధారపడాల్సిన అవకాశం తగ్గుతుందన్నారు. పర్యావరణ పరిరక్షణ మరియు క్రిటికల్ మైనింగ్ రంగంలో స్వయం సమృద్ధి సాధించడానికి పట్టణ మైనింగ్ పై కూడా దృష్టి పెట్టాలన్నారు. రీ సైక్లింగ్ సహా కీలకమైన ఖనిజాల విభాగాల్లో అవగాహన కల్పించడం, కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించడం ప్రస్తుతం అత్యంత అవసరమన్నారు.



పేదల గురించి పేర్ని మాట్లాడటం హాస్యాస్పదం

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

చిరు వ్యాపారుల పేరుతో పేర్ని నాని అండ్ బ్యాచ్ చేస్తున్న చిల్లర రాజకీయం చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని టిడిపి నాయకులు ఎద్దేవా చేశారు. సోమవారం నియోజక వర్గ కార్యాలయంలో నిర్వహించిన విలేఖర్ల సమావేశంలో మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ బాబాప్రసాద్ మాట్లాడుతూ రోడ్లపై కూరగాయల షాపులు, పండ్ల దుకాణాలు ఏర్పాటు కారణంగా ఎదురవుతున్న ఇబ్బందులు, ప్రయాణికుల అవస్థల నేపథ్యంలో కాస్త వెనక్కి జరిగి వ్యాపారాలు చేసుకోమంటే వైసీపీ నాయకులు నానా యాగీ చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. గతంలో అశీలు పేరుతో పేర్ని నాని అండ్ బ్యాచ్ పేదల్ని, చిరు వ్యాపారుల్ని దోచుకుంటుంటే దాన్ని రద్దు చేసిన ఘనత కొల్లు రవీంద్రదేనన్నారు. రోడ్లపై వ్యాపారాలు, అక్కడే చెత్త పడేయడం కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయని వరుసగా ఫిర్యాదులు అందుతున్నాయని, ఈ నేపథ్యంలోనే వారిని వెనక్కి జరిగి వ్యాపారాలు చేసుకోమన్నామని చెప్పారు. సానుభూతి కోసం సిగ్గులేని రాజకీయం చేస్తే చూస్తూ ఊరుకోబోమన్నారు. ఈ కార్యక్రమంలో 17వ డివిజన్ కార్పొరేటర్ మరకాని సమత కీర్తి, పిప్పళ్ల వెంకన్న, దిలీప్, ఇలియాస్ పాషా, మరకాని పరబ్రహ్మం, పల్లపాటి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణకు ఆక్రమణలు అడ్డంకి

ప్రజాశక్తి-గన్నవరం: గన్నవరం మండలం గొల్లనపల్లి రైస్ మిల్లు వద్ద రోడ్డు ఆక్రమణలు తొలగించకపోవడం పలు విమర్శలకు దారితీస్తోంది. రోడ్డు విస్తరణకు ఈ ఆక్రమణలు పెద్ద అడ్డంకిగా మారాయి. కాంట్రాక్టర్ గాని, అధికారులు గానీ పట్టించుకోకపోవడం పట్ల స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. గన్నవరం - ఆగిరిపల్లి రోడ్డును రూ. 17 కోట్లతో అభివద్ధి చేస్తున్నారు. కానీ రోడ్డు పక్కన ఆక్రమించుకొన్న ఆక్రమణలు తొలగించాలని నాలుగు గ్రామాల ప్రజలు చిక్కవరం, గోపర గూడెం, గొల్లంపల్లి, బిబి గూడెం ప్రజలు అధికారులను డిమాండ్ చేస్తున్నారు. నాలుగు రోడ్ల సెంటర్ కావటం అటునుండి వచ్చే వాహనాలకు ఆక్రమణలతో రోడ్డు కనిపించక పోవటం వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అందువల్ల ప్రమాదాలు జరకుండా ఉండేందుకు ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని అంటున్నారు. ముగ్గురు వ్యక్తులు రోడ్డును ఆక్రమించి కొట్లు కట్టేశారు. ఆగిరిపల్లి నుండి గన్నవరం వయా విజయవాడ వెళ్లే క్వారీ లారీలు నిత్యం వెళు తుంటాయి. బస్సులు, వాహనాలు వెళ్తాయి. బడ్డీ కొట్లు వద్ద వెహికల్స్ ఆపడంతో రద్దీగా ఉంటుంది. ఇతర వాహనాలు వెళ్లడానికి ఇబ్బందికరంగా ఉంటుంది. నిత్యం రద్దీగా ఉండే



నాలుగు రోడ్ల సెంటర్ నుండి వచ్చే గోపవరపుగూడెం, చిక్కవరం నుండి వచ్చే వాహనాలు కనపడక ప్రమాదాలు జరుగుతున్నాయి. అక్కడే గత ఏడాది నాలుగు ప్రమాదాలు జరిగి నలుగురు మరణించారని పలువురు తెలిపారు. రోడ్డు పైనీళ్లు నిలిచి గుంతలు పడే ప్రమాదం కూడా ఉంది.అలాగే అక్రమణల కింద బిబి గూడెం వెల్లేవాటర్ పైపులైను, మెగాగ్యాస్ పైపులు కూడా ఉన్నాయి. గ్యాస్ లీక్ అయ్యే ప్రమాదం చోటుచేసుకోకుండా ప్రజలను కాపాడాలని అంటున్నారు. అందువల్ల అక్రమణలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని, ప్రమాదాలు నుండి రక్షించాలని కోరుతున్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి-ఉయ్యూరు: నిష్ణాతులైన అధ్యాపకులచే తయారు చేయబడిన పదవ తరగతి టెస్ట్ పేపర్స్, స్టడీ మెటీరియల్ విద్యార్థులకు మరింత ఉపయోగ పడుతుందని రిటైర్డ్ ఎంఈఓ ఉయ్యూరు బాలోత్సవ కమిటీ కన్వీనర్ కె విశ్వ మోహన్ అన్నారు. ఉయ్యూరు మండలంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలకు డాక్టర్ జ్యోతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులందరికీ అందజేశారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులచే తయారు కాబడిన స్టడీ మెటీరియల్ విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని ట్రస్ట్ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉయ్యూరు విజ్ఞాన కేంద్రం బాధ్యులు కే శివ నాగేంద్రం పాల్గొన్నారు.



ఎంఎల్ఎ ఎదుట జనసైనికుడు ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): గూడూరు మండల టీడీపీ అధ్యక్షులు పోతన స్వామి నాయుడు వేధింపులు తాళలేక గూడూరుకు చెందిన జనసైనికుడు సంతోష్ సోమవారం పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ఎదుట పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నంకు పాల్పడ్డాడు. పక్కనే ఉన్న పోలీసులు అడ్డుకుని జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఎమ్మెల్యే కంకటావలో రోడ్డు పనుల ప్రారంభానికి వస్తుండగా కారుకు అడ్డం పడ్డాడు. అనేకసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోకపోవటంతో మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు వాపోయాడు. ప్రస్తుతం సంతోష్ పరిస్థితి నిలకడగా ఉన్నట్లు ఎలాంటి ప్రమాదం లేదని ఆసుపత్రి వైద్యులు తెలిపారు.


అర్జీలు స్వీకరిస్తున్న జెసి గీతాంజలి శర్మ

అర్జీల పరిష్కారంపై దృష్టి సారించాలి : జెసి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసంలో వచ్చిన అర్జీల పరిష్కారంలో గడువు దాటిన అర్జీలపై, పెండింగ్ కోర్టు కేసులపై దష్టి సారించాలని జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ సోమవారం కలెక్టరేట్లో మీకోసం నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసంలో పెండింగ్ అర్జీలపై జాయింట్ కలెక్టర్ సమీక్షిస్తూ గడువు దాటేదాకా ఉండకూడదని, గడువులోగానే అర్జీలు పరిష్కరించాలన్నారు. వివిధ శాఖలలో పెండింగ్ కోర్టు కేసులు సమీక్షిస్తూ కోర్టు తుది ఆదేశాలు అమలు పరచక పోవడంతో కోర్టు ధిక్కరణ కేసులు పడుతున్నాయని, ఆ విధంగా జరగకుండా పెండింగ్ కోర్టు కేసులపై దష్టి సారించాలన్నారు. కోర్టు ధిక్కరణ కేసులలో ఇప్పటివరకు తీసుకున్న చర్యలు సమీక్షించి, కోర్టు ఆదేశాలు సకాలంలో అమలుకు చర్యలు తీసుకోవాలన్నారు. కొన్ని సందర్భాల్లో కోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇస్తుందని, వాటిని కూడా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈనెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించుటకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. యువ ఓటర్లకు ఫోటో ఓటర్ కార్డుల పంపిణీ, వద్ధ ఓటర్లను సన్మానించడం, కళాశాల విద్యార్థులతో ర్యాలీలు నిర్వహించి ఓటు హక్కు యొక్క ప్రాముఖ్యత తెలియజేస్తూ ఓటర్లను చైతన్యవంతం చేయాలని అన్నారు.ఈనెల 26 గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించుటకు చర్యలు తీసుకోవాలని, జిల్లా కలెక్టర్ వారి ప్రసంగ పాటం సిద్ధం చేయాలని, వివిధ శాఖలలో ఉత్తమ సేవలందించిన అధికారులు, ఉద్యోగులకు ప్రశంస పత్రాలు అందించుటకు పేర్లు వెంటనే పంపాలని అధికారులకు సూచించారు. అనంతరం వైద్య ఆరోగ్య శాఖ కుష్టు వ్యాధి విభాగం ద్వారా కుష్టు వ్యాధి అవగాహన కార్యక్రమం పై ముద్రించిన పోస్టర్లు, కరపత్రాలను జాయింట్ కలెక్టర్ విడుదల చేశారు. జిల్లాలో కుష్టు వ్యాధి పట్ల అవగాహన కల్పించేందుకు ఇంటింటి సర్వే ఈరోజు నుండి ప్రారంభించి ఫిబ్రవరి 2 వరకు నిర్వహిస్తున్నట్లు, వివిధ శాఖల అధికారులు సహకరించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ ఎస్ శర్మిష్ట తెలిపారు.బందరు ఆర్డిఓ కే స్వాతి, సివిల్ సప్లై డిఎం పద్మాదేవి, మెప్మా పిడి సాయిబాబు జాయింట్ కలెక్టర్ తో పాటు మీకోసం లో పాల్గొని ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో కె కన్నమనాయుడు, పంచాయతీరాజ్ ఎస్ఇ రమణ రావు, నగరపాలక సంస్థ కమిషనర్ బాపిరాజు, డ్వామా పిడి కె.వి శివప్రసాద్ యాదవ్, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.పద్మావతి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు

స్వచ్ఛ చల్లపల్లి కార్యకర్తలకు సత్కారం

ప్రజాశక్తి-చల్లపల్లి: స్వచ్ఛ చల్లపల్లి కార్యక్రమం గ్రామానికి వరం అని సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి అన్నారు. సోమవారం చల్లపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన గ్రామ సభలో లోక్ నాయక్ ఫౌండేషన్ పురస్కారం అందుకున్న స్వచ్ఛ చల్లపల్లి కార్యకర్తలను సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కృష్ణకుమారి మాట్లాడుతూ గత పదేళ్లుగా ప్రముఖ వైద్యులు డాక్టర్ డి.ఆర్.కే ప్రసాద్ - డాక్టర్ తరిగోపుల పద్మావతి ఆధ్వర్యంలో గ్రామంలోని స్వచ్ఛ కార్యకర్తలు అందిస్తున్న సేవలతో గ్రామ రూపురేఖలు మారిపోయాయన్నారు. డీ.ఆర్.కే ప్రసాద్ - పద్మావతి దంపతులు, స్వచ్ఛ కార్యకర్తల శ్రమ వెల కట్టలేనిది అన్నారు. వారందరిని కషితో స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యక్రమానికి దేశంలోని అనేక ప్రాంతాల్లో సముచిత గుర్తింపు, ప్రాధాన్యత, గౌరవం లభిస్తున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా విశాఖపట్నంలో డీ.ఆర్.కే ప్రసాద్ - పద్మావతి దంపతుల తరపున లోక నాయక్ ఫౌండేషన్ పురస్కారం అందుకున్న స్వచ్ఛ కార్యకర్త ప్రాతూరి ఉదయ శంకర్ శాస్త్రిని, స్వచ్ఛ కార్యకర్తలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పంచాయతీ ఈఓ మాధవేంద్రరావు, సిబ్బంది పాల్గొన్నారు.

బందరు డిఎస్‌పిగా రాజా బాధ్యతలు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): బందరు డిఎస్పీగా చప్పిడి రాజా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా చప్పిడి రాజా బందర్ సబ్ డివిజన్ డిఎస్పీగా బదిలీ అయ్యారు.బందర్ సబ్ డివిజన్ డిఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన చప్పిడి రాజాకు సబ్ డివిజన్ పరిధిలోని సిఐలు, ఎస్సైలు సాదర స్వాగతం పలికారు. బాధ్యత స్వీకరించిన అనంతరం జిల్లా ఎస్పీ ఆర్ గంగాధరరావును మర్యాదపూర్వకంగా కలిశారు.



శ్రీ చైతన్య కళాశాలపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-కంకిపాడు: విద్యార్థి తండ్రిని ఇబ్బంది పెట్టిన మండలంలోని గోశాలలో ఉన్న శ్రీ చైతన్య బాయ్స్ క్యాంపస్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్.సమరం డిమాండ్ చేశారు. సోమవారం క్యాంపస్ వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థి గౌతం తండ్రిపై శ్రీ చైతన్య కాలేజ్ యాజమాన్యం కఠినంగా వ్యవహరించిందన్నారు. కళాశాల ఫీజు చెల్లిస్తేనే లోపలకు అనుమతిస్తామని చెప్పారని, ఆ సమయంలో కూడా తన దగ్గర ఉన్న 20 వేల రూపాయలను ఫీజు చెల్లించినా యాజమాన్యం ధోరణి చాలా దారుణంగా ఉందన్నారు. విద్యార్థి తండ్రి ఇంటికి వెళ్లడానికి ఛార్జీలు లేవని చెప్పినా వినలేదని, మొత్తం చెల్లిస్తేనే అనుమతిస్తామని చెప్పడం దారుణమన్నారు. తల్లిదండ్రులపై కఠినంగా వ్యవహరించిన శ్రీ చైతన్య కాలేజీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఈ.ప్రేమ్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు నాగేంద్ర పాల్గొన్నారు.



సమాధుల దొడ్డిని పరిరక్షించండి

ప్రజాశక్తి-గుడివాడ : స్థానిక 1వ వార్డులోని నాగవరప్పాడు చంద్రయ్య డ్రైన్ ప్రక్కన ఉన్న రెండు ఎకరాల సమాదుల దొడ్డిలో తక్షణమే ఆక్రమణలు తొలగించాలని దళిత నాయకులు సింగవరపు జోసఫ్, దారం కరుణాకర్, రాచూరి రాజు, చొప్పల జోషిలు ఆర్‌డివో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాగవరప్పాడు సమీపంలోని చంద్రయ్య డ్రైన్‌ను ఆనుకుని ఉన్న దళిత, క్రైస్తవులు సమాదులు వద్ద ఉన్న కొద్దిపాటి ఖాళీలను సైతం కొంత మంది గడ్డివాములు పెట్టి ఆక్రమించడం జరిగిందన్నారు. గతంలో మున్సిపల్, రెవెన్యూ అధికారులకు అనేకసార్లు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. ఈ విషయమై అధికారులు ప్రజా ప్రతినిధులు విచారణ చేయించి న్యాయం చేయాలని కోరారు. భవిష్యత్‌లో సమాధుల కోసం నూతనంగా స్థలం కొనుగోలు చేసి స్థలాలకు ప్రహరీ గోడను నిర్మించాలన్నారు. అనంతరం ఆర్‌డివో కార్యాలయం ఏఓకు వినతిప్రతాన్ని అందజేశారు.



స్కోడా కైలాక్ కారుకు 5-స్టార్ రేటింగ్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : స్కోడా ఆటో ఇండియా మొదటి సబ్-4 మీటర్ల ఎస్‌యువి కైలాక్, భారత్ ఎన్సీఏపీ (న్యూ కార్ అసెస్‌మెంట్ ప్రోగ్రామ్)లో ప్రతిష్టాత్మకమైన 5-స్టార్ భద్రతా రేటింగ్‌ను సాధించిందని సంస్థ డైరెక్టర్ పీటర్ తెలిపారు. నగరంలోని స్కోడా ఆటోమొబైల్ షోరూంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. ఎన్సీఏపీ పరీక్షలో పాల్గొన్న మొట్టమొదటి స్కోడా వాహనంగా కైలాక్ నిలిచిందన్నారు. కుషాక్, స్లావియా నెలకొల్పిన భద్రతా శ్రేష్ఠత బ్రాండ్ వారసత్వాన్ని కొనసాగిస్తోందన్నారు. స్కోడా ఆటో ఇండియా 2.0 కార్లు రెండూ పెద్దలు, పిల్లల ప్రయాణికుల రక్షణ కోసం సంబంధిత గ్లోబల్ ఎన్సీఏపీ క్రాష్ పరీక్షలలో 5-స్టార్ భద్రతా రేటింగ్‌లను సాధించాయని తెలిపారు. సమగ్ర భద్రతా వ్యవస్థలతో వస్తున్న కైలాక్‌లో ఆరు ఎయిర్‌బ్యాగ్‌లతో సహా విస్తృత శ్రేణి యాక్టివ్, పాసివ్ భద్రతా లక్షణాలు ప్రామాణికంగా ఉన్నాయని తెలిపారు. హాట్-స్టాంప్డ్ స్టీల్ వాడకం, రీడోన్ క్రాష్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌తో కైలాక్‌లో సాధ్యమైనంత ఉత్తమమైన భద్రతను నిర్ధారిస్తుందని పేర్కొన్నారు.



కథానిక పోటీల్లో సిద్ధార్థ విద్యార్థినికి బహుమతి

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : విద్యా వికాస వాహిని (కంకిపాడు) ఇటీవల నిర్వహించిన తెలుగు కథానిక పోటీల్లో పి.బి.సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలకు చెందిన బిఎస్సీ డేటా సైన్స్ రెండో సంవత్సరం విద్యార్థిని రామవరపు స్రవంతి తృతీయ బహుమతి గెలుచుకుంది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, డైరెక్టర్ వేమూరి బాబూరావు, తెలుగు శాఖాధిపతి డాక్టర్ ఎన్.శివకుమార్, సహాయక ఆచార్యులు డాక్టర్ సశ్రీ, డాక్టర్ పి.నీరజ, శేషారత్నం విజేతలను అభినందించారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోరుతూ వినతి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : జగ్గయ్యపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి తన భార్య రాజునిర్మల కుమారికి కేటాయించాలని కోరుతూ సోమవారం రావిరాల గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు ఇనుపనూర్తి రాజు మాజీ మంత్రి, టిడిపి జిల్లా అధ్యక్షులు నెట్టెం రఘురాం, స్థానిక శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్యకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ తన కుటుంబం పార్టీ ఆవిర్భావం నుండి సాధారణ కార్యకర్తగా పార్టీ కోసం పనిచేస్తున్నానని, 1999 - 2001లో జగ్గయ్యపేట మండల తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగా, 2017-2019 జగ్గయ్యపేట వ్యవసాయ మార్కెట్ యాడ్ డైరెక్టర్‌గా పలు పదవుల్లో ఉన్నానన్నారు. పార్టీ కోసం వివిధ సేవా కార్యక్రమాలు సొంత ఖర్చులతో నిర్వహిస్తూ ఉన్నామని, ఎన్నో కేసులను సైతం ఎదుర్కొని మనోధైర్యంతో పార్టీతో నడుస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు అర్లయ్య, రవి, చిన్ని తదితరులు పాల్గొన్నారు.



జాతీయ సెపక్ తక్రా పోటీలను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : ఈ నెల 24 నుంచి 27వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఎన్‌టిఆర్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సంయుక్తంగా నగరంలో నిర్వహిస్తున్న 68వ అండర్ 14 బాల బాలికల స్కూల్ గేమ్స్ జాతీయ సెపక్ తక్ర పోటీలు విజయవంతంగా నిర్వ హించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.లక్ష్మి నరసింహారావు కోరారు. సోమవారం పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జాతీయ సెపక్ తక్ర పోటీల నిర్వహణ కమిటీల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోటీలు స్థానిక పటమట జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో జరుగుతాయని, పోటీల్లో పాల్గొనే బాలబాలికలతో తల్లి తండ్రుల్లా మెలగాలని, వాళ్ళకి కుటుంబ వాతావరణం కల్పించి వారికి ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని సూచించారు. రాష్ట్ర స్కూల్ గేమ్స్ కార్యదర్శి జి.భానుమూర్తి రాజు మాట్లాడుతూ ఈ జాతీయపోటీల్లో 15 రాష్ట్రాల బాల బాలికల జట్లు పాల్గొంటున్నాయని చెప్పారు. అన్ని రాష్ట్రాల జట్టుకు స్థానిక హోటల్‌లలో ఉచిత బస ఏర్పాటు చేస్తున్నామని వారికి ఎటువంటి సమస్యలు తలెత్తకుండా పూర్తి రక్షణ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చేవారు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా రైల్వే స్టేషన్, బస్టాండ్‌లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి రవాణా సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. పోటీలు జిల్లా కలెక్టర్ లక్ష్మి శ, పార్లమెంటు సభ్యుడు కేశినేని చిన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారని అన్ని ఏర్పాట్లు పరిశీలిస్తున్నారని తెలిపారు. జిల్లా కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ పోటీలకు 4 కోర్టులను ఏర్పాటు చేస్తున్నామని, అందులో రెండు ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. పోటీలు లీగ్ కమ్ నాక్ అవుట్ పద్ధతిలో జరుగుతాయని, ప్రతి రోజూ ఉదయం 8 నుంచి 12 గంటల వరకు తిరిగి సాయంత్రం 4 నుంచి 10 గంటల వరకు పోటీలు జరుగుతాయని వివరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర స్కూల్ గేమ్స్ సంయుక్త కార్యదర్శి కె.వి.రాధాకృష్ణ, ఎ.పి.రాజు, పోటీల కార్యనిర్వహణ కార్యదర్శి ఎస్.రమేష్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ పోటీల లోగోను ఆవిష్కరించారు.



లోగోను ఆవిష్కరిస్తున్న సెపక్ తక్ర పోటీల నిర్వహణ కమిటీ సభ్యులు

మత్తుపదార్థాలతో జీవితం దుర్భరం

విజయవాడ : మత్తు పదార్థాలతో జీవితం దుర్భరం చేసుకోవద్దని, మత్తుపదార్థాల వల్ల ఆరోగ్యం క్షీణించడంతో పాటు సామాజికంగా, ఆర్థికంగా నష్టపోయి కుటుంబ సత్సంబంధాలను కోల్పోతామనినవజీవన్ బాల భవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్ళమూడి శేఖర్ బాబు తెలిపారు. నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో తాడిగడపలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మత్తు పదార్థాల దుర్వినియోగంపై అవగాహనా కార్యక్రమాన్ని స్క్రీన్ ప్రొజెక్టర్ ద్వారా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరి అయిన అవగాహన లేక మాదకద్రవ్యాలకు ఎక్కువ మంది బానిసలవుతున్నారని, ముందుగానే సరైన అవగాహన పెంచుకొని జీవితాలను చక్క దిద్దికోవాలని అన్నారు. అనంతరం నీతోడు మానసిక వికాసకేంద్రం జోనల్ కోఆర్డినేటర్ కె.ప్రియాంక మాట్లాడుతూ మత్తు పదార్థాల జోలికి వెళ్ళద్దు అని తెలిసో తెలియక మాదకద్రవ్యాలకు అలవాటు చేసుకుంటున్నారని అన్నారు. జోనల్ కోఆర్డినేటర్ జె జ్యోతి చంద్రిక మాట్లాడుతూ ఈ మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన బాలలను, యువతను డీ-ఎడిక్షన్ చికిత్స ద్వారా సాధారణ స్థితికి తీసుకు రావచ్చని ఈ చికిత్స అందించేందుకు 'నవజీవన్ బాల భవన్ సంస్థ వారు నూజివీడులో బోస్కో డీ-ఎడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేసిందని ఈ



లాంటి సమస్యలతో ఉన్నవిద్యార్థులకు, యువతకు నూజివీడు మండలం పొలసానపల్లిలో ఏర్పాటు చేసిన 'బోస్కో డీ అడిక్షన్ కేంద్రాన్ని' ఉచితంగా సంప్రదించవచ్చని సంప్రదించవలసిన ఫోన్ నంబర్ 9490492020 అని అన్నారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ.కనకదుర్గ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల వలన విద్యార్థులకు ఎంతో ఉపయోగమన్నారు. ఈ కార్యక్రమంలో నీతోడు మానసిక వికాసకేంద్రం జోనల్ కోఆర్డినేటర్స్ ఎస్‌కె.నజ్మా, డి.విజయరాణి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సైన్స్ ప్రయోగాల వినూత్న పోటీల కరపత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : జన విజ్ఞాన వేదిక కొండపల్లి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో డాక్టర్ మోహన్‌రావు మెమోరియల్ ట్రస్ట్ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి కొండపల్లి జెవివి అధ్యక్షులు ఎస్.నాగరాజు అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా కొండపల్లి శాఖ గౌరవ అధ్యక్షులు డాక్టర్ మామిడి శీతారామారావు, జిల్లా జెవివి అధ్యక్షులు వెనిగళ్ళ మురళీమోహన్ జిల్లా ఉపాధ్యక్షులు పట్ల కామేశ్వరరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఇందులో జెవివి రాష్ట్రస్థాయి సైన్స్ ప్రయోగాల వినూత్న పోటీలు 2025 కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జెవివి గత 34 సంవత్సరాల నుండి చెకుముకి సంబరాలను రాష్ట్రంలోని విద్యార్థులకు పాఠశాల స్థాయి నుండి మండల జిల్లా రాష్ట్ర స్థాయిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. నేటి బాలలే రేపటి శాస్త్రవేత్తలుగా ఎదగడానికి పాఠశాలల నుండి చేసే ప్రయోగాలే పునాదులని, విద్యార్థులు స్వయంగా ప్రయోగాలు చేయడం ద్వారా ఆలోచన నైపుణ్యాలను క్లిష్టమైన సమస్యల పరిష్కారానికి తార్కిక విధానం అలవర్చుకోవడం సాధ్యపడుతుందన్నారు. సైన్స్ దినోత్సవం (ఫిబ్రవరి 28) సందర్భంగా గత మూడు సంవత్సరాలుగా సైన్స్ ప్రయోగాల వీడియో పోటీలు జెవివి నిర్వహిస్తుందని ఈ సంవత్సరం రాష్ట్రవ్యాప్త వీడియో పోటీలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ పోటీల



వల్ల విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధి సైన్స్ సిద్ధాంతాలను మెరుగ్గా అర్థం చేసుకోవడం చదువులో ఆత్మవిశ్వాసం పెరగడానికి తోడ్పడుతుందన్నారు. ప్రయోగాంశాలుగా సైన్స్ అండ్ టెక్నాలజీ పర్యావరణం సుస్థిర అభివృద్ధి మూఢనమ్మకాలు శాస్త్రీయ దృక్పథం 8, 9, 10 తరగతిలో విద్యార్థులకు ఈ పోటీల్లో పాల్గొన్న అవకాశం కల్పించారు. లో కాస్ట్ నో కాస్ట్‌లో చేసిన ప్రయోగాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. వీడియోలను రాష్ట్ర కమిటీకి ఫిబ్రవరి 15 కల్లా పంపాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెవివి కొండపల్లి శాఖ కార్యదర్శి ఎస్.కె సర్దార్ సాహెబ్, కోశాధికారి చేతన్ మురళి, బి డేవిడ్ రాజ్ పాల్గొన్నారు.



విజ్ఞాన్ విద్యార్థికి ట్రిపుల్ ఐటిలో సీటు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: 2023-24 విద్యాసంవత్సరంలో 10వ తరగతి 553 మార్కులతో పూర్తి చేసిన విజ్ఞాన్ విద్యాసంస్థ విద్యార్థిని మూడావతు వెన్నెల ట్రిబుల్ ఐటీ ఇడుపులపాయ బ్రాంచిలో సీటు సాధించటం ఎంతో గర్వకారమని జగ్గయ్యపేట వైసిపి ఇన్చార్జి తన్నీరు నాగేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో సీట్ సాధించిన విద్యార్థిని వెన్నెలను శాలువా, మెమెంటో, పుష్ప గుచ్ఛంతో సత్కరించారు. ఈ సందర్భంగా భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని దీవించారు. స్కూల్ డైరెక్టర్ తన్నీరు సుధారాణి మాట్లాడుతూ ట్రిబుల్ ఐటీ స్థాపించినప్పటి నుండి తమ విద్యాసంస్థకు చెందిన విద్యార్థులు ప్రతి సంవత్సరం సీట్లు సాధిస్తున్నారని, మా విద్యాసంస్థలో ఎన్సిసి కలిగి ఉండటం వల్ల ఇటువంటి ప్రతిష్ఠాత్మక సీట్లు సాధించటం సులువవుతుందని తెలిపారు.

మారుతీ సుజుకి ఎలక్ట్రికల్ వాహనం విడుదల

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : మారుతి సుజుకీ ఇండియా లిమిటెడ్ (ఎంఎస్ఐఎల్) తమ మొదటి బి-ఈవీ (బ్యాటరీ ఎలక్ట్రిక్ వెహికల్)- ఎస్యూవీ ఈవిటారాను విడుదల చేసినట్లు సంస్థ హెడ్ పరమేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా మారుతి షోరూంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు 'ఈ ఫర్ మీ' ఎలక్ట్రిక్ పర్యావరణ పరిష్కారాలతో పాటు భారత్ మొబిలిటి గ్లోబల్ ఎక్స్ పో 2025ను ప్రారంభించిందనీ ఇందులో తమ వెహికల్‌కి మంచి ఆదరణ లభించిందని అన్నారు. హియర్టెక్ట్-ఈ ప్లాట్ఫాంపై నిర్మితమైన, ఈవిటారా గొప్ప సామర్థ్యాన్ని, అమోఘమైన శ్రేణిని సాటిలేని సౌకర్యం, భద్రతతో అందిస్తోందని తెలిపారు. ప్రీమియం నెక్సా ఛానల్లో పరిచయం చేయబడటానికి సిద్ధంగా ఉన్న ఈవిటారా నెక్సా కీలకమైన విలువైన వినూత్నత, ఆధునికత, ప్రీమియం కస్టమర్ అనుభవానికి చిహ్నంగా నిలిచిందని తెలిపారు. వివరాలకు మారుతి షోరూంలో సంప్రదించవచ్చని తెలిపారు.

25, 26 తేదీల్లో పండిత సభ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : కంచి కామకోటి పీఠం జగద్గురు శంకర విజయేంద్ర సరస్వతీ ఆదేశానుసారం ఈనెల 25,26 తేదీలలో కొలనుకొండలోని కంచి కామకోటిలో సిద్ధాంత పండిత సభ నిర్వహిస్తున్నట్లు కంచికామకోటి సర్వజ్ఞపీఠ ఆస్థాన సిద్ధాంతి విజయ సుబ్రహ్మణ్య సిద్ధాంతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభలో ప్రధానంగా ఉత్తరాయణ ఆరంభ నిరూపణం అనే అంశంపై చర్చ జరుగుతుందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, మహారాష్ట్ర, కర్నాటక, ముంబై తదితర రాష్ట్రాల నుంచి కొందరు ప్రత్యక్షం గానూ, మరికొందరు ఆన్లైన్ ద్వారా ను పాల్గొంటారని తెలిపారు. మరిన్ని వివరాలకు 9963732303 నెంబరులో సంప్రదించాలని సూచించారు.